B9 NEWS
నిజం - మా ఇజం

మన.. ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం...



PUBLISHED FROM:
Telangana & Andhrapradesh

సంపుటి : 01 | సంచిక : 245 | మన ప్రజాపక్షం | 20-09-2026 | ఎడిటర్ : పులిజ్వాల చంద్రకాంత్ | పేజీలు : 08 | వెల : 05/-



ముమ్మాటికీ కాంగ్రెస్
మార్క్ కరవు

- ఇది ప్రకృతి తెచ్చిన కరవు కాదు,ముమ్మాటికీ కాంగ్రెస్ మార్క్ కరవు: హరీశ్‌రావు
- శ్రీశైలం నుంచి 84 టీఎంసీలు వాడామన్నది పచ్చి అబద్ధం
- గత మూడేళ్లలో ఏపీ 718, తెలంగాణ కేవలం 216 టీఎంసీలే వాడిందన్న హరీశ్ రావు
- రాష్ట్ర చరిత్రలోనే ఈ ఏడాది అత్యల్పంగా కృష్ణా జలాల వినియోగం
- నీళ్లు, మోటార్లు ఉన్నా ప్రభుత్వం వాడుకోలేకపోయిందని విమర్శ

2

మన ప్రజాపక్షం,హైదరాబాద్

మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ప్రకృతి వైపరీత్యం వల్ల వచ్చినవి కావని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ అసమర్థత వల్ల ఏర్పడిన కాంగ్రెస్ మార్క్ కరవు అని ఆయన ఆరోపించారు. కృష్ణా జలాలు వినియోగంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆయన ధ్వజమెత్తారు.శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ, ఈ ఏడాది శ్రీశైలం నుంచి 84 టీఎంసీల నీటిని వినియోగించుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్





వరంగల్ ఎయిర్‌పోర్టుకు పేరు సూచించాలన్న రేవంత్ రెడ్డి
రెండు పేర్లను సూచించిన సందీప్ రెడ్డి వంగా

పేర్లను సూచించండి

వరంగల్ మామునూరులో రానున్న కొత్త ఎయిర్‌పోర్టుకు ఏం పేరు పెట్టాలో సూచించాలని రేవంత్ రెడ్డి కోరారు. విమానాశ్రయానికి తాను రెండు పేర్లను సూచించాలనుకుంటున్నానని డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా తెలిపారు.

మన ప్రజాపక్షం,హైదరాబాద్

వరంగల్ మామునూరు విమానాశ్రయం ఏర్పాటుకు చేపడుతున్న చర్యలు కీలక దశకు చేరుకున్నాయి. అనుమతుల దగ్గర నుంచి భూసేకరణ, సాంకేతిక పరమైన పరిశీలన దశలను దాటుకొని నిర్మాణ పనులను 3 ప్యాకేజీలుగా చేపట్టేందుకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్ణయించింది. ఇప్పటికే 2 ప్యాకేజీల పనులకు వేర్వేరుగా టెండర్లు పిలిచి ప్రక్రియను పూర్తి చేసిన విషయం తెలిసిందే.

కొత్త గేట్‌వే విమానాశ్రయం

2

మామునూరులో రానున్న కొత్త ఎయిర్‌పోర్టుకు ఏం పేరు పెట్టాలో సూచించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. వరంగల్‌లో ప్రపంచ స్థాయి విమానాశ్రయం కల సాకారం కాబోతోందని ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. మామునూరు విమానాశ్రయం ఏర్పాటు కోసం చురుగ్గా జరగుతున్న ప్రక్రియలపై పత్రికల్లో వచ్చిన కథనాలను ఎక్స్‌లో సీఎం పోస్ట్ చేశారు.బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉన్నప్పటికీ వరంగల్ విమానాశ్రయం కలను నిజం చేయలేకపోయిందన్న రేవంత్ రెడ్డి ఆ పార్టీ నాయకులు కేవలం తమ కుటుంబ ప్రయోజనాలు, విలాసవంతమైన ఫామ్‌హౌస్‌లపైనే దృష్టి పెట్టారని వ్యాఖ్యానించారు. ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రజాపాలనలో ఇప్పుడు వరంగల్ ఎయిర్‌పోర్ట్ కల సాకారం అవుతోందని స్పష్టం చేశారు. మామునూరు విమానాశ్రయం భూసేకరణ కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.295 కోట్ల కేటాయించడంతో పాటు అవసరమైన భూమిని సేకరించి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు అప్పగించడంతో



కేసీఆర్‌కు చెంపపెట్టు


- దానం నాగేందర్‌పై కోర్టు తీర్పు... కేసీఆర్‌కు చెంపపెట్టు అన్న మహేశ్ కుమార్ గౌడ్
- తెలంగాణలో పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించింది కేసీఆరేనని విమర్శ
- ప్రభుత్వాలను కూల్చివేయడం బీజేపీకి అలవాటుగా మారిందని ఆగ్రహం
- దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను బీజేపీ నాశనం చేస్తోందని మండిపాటు
- ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం కాంగ్రెస్‌దేనని ధీమా

2

జన్వాడ ఫాంహౌస్

నాలాపై కట్టిన అక్రమ నిర్మాణమే: కాంగ్రెస్ ఎంపీలు

జన్వాడ ఫాంహౌస్ ను పరిశీలించిన కాంగ్రెస్ ఎంపీలు
ఈ ఫాంహౌస్ నిర్మాణానికి అనుమతులు లేవన్న ఎంపీ చామల
అసలు యజమాని ఎవరనే దానిపై అనుమానాలు ఉన్నాయని వ్యాఖ్య



వికసిత్ భారత్ లక్ష్యంలో
తెలంగాణ కీలక పాత్ర

2

: భట్టి విక్రమార్క



మన ప్రజాపక్షం,హైదరాబాద్

వికసిత్ భారత్ లక్ష్య సాధనలో తెలంగాణ రాష్ట్రం కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని తెలిపారు. దేశ

కాన్వాయ్ ఆపి సాయం

- బండి సంజయ్ మానవత్వం.. కాన్వాయ్ ఆపి ప్రమాద బాధితులకు సాయం
- రాజీవ్ రహదారిపై ప్రమాద బాధితులను ఆదుకున్న బండి సంజయ్
- డివైడర్‌ను ఢీకొని బోల్తా పడిన కారు.. బాలికకు తీవ్ర గాయాలు

2

- ఘటనను గమనించి తన కాన్వాయ్‌ను ఆపిన కేంద్ర మంత్రి
- గాయపడిన వారిని తన భద్రతా వాహనంలో ఆసుపత్రికి తరలింపు



మన ప్రజాపక్షం,హైదరాబాద్

కేంద్ర సహాయ మంత్రి, బీజేపీ సీనియర్ నేత బండి సంజయ్ మానవత్వాన్ని చాటుకున్నారు. మార్గమధ్యంలో జరిగిన ఒక రోడ్డు

ధైర్యంగా పోరాడదామని
సీఎం రేవంత్ చెప్పారు

- ధైర్యంగా పోరాడదామని సీఎం రేవంత్ చెప్పారు: దానం నాగేందర్
- పార్టీ ఫిరాయింపుల కేసులో దానంపై అనర్హత వేటు వేసిన హైకోర్టు
- సుప్రీంకోర్టుకు వెళ్లే ఉద్దేశం తనకు లేదని వ్యాఖ్య
- ఉపఎన్నికలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నానన్న దానం

2





2

సుప్రీంకోర్టును ఆశ్రయించిన
దానం నాగేందర్

- అనర్హత తీర్పుపై.. సుప్రీంకోర్టును ఆశ్రయించిన దానం నాగేందర్
- హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన దానం నాగేందర్
- తన అనర్హతను సవాల్ చేస్తూ స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూ కాంగ్రెస్ తరపున పోటీ చేయడమే కారణం
- ఇప్పటికే సుప్రీంలో కేవియట్ దాఖలు చేసిన ఇతర ఎమ్మెల్యేలు

మన ప్రజాపక్షం,హైదరాబాద్

ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా తనపై అనర్హత వేటు వేస్తూ తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పును దానం నాగేందర్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. శనివారం మధ్యాహ్నం ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేశారు.బీఆర్ఎస్ తరపున గెలిచి, ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరిన దానం



2

అమిత్ షాకు
అస్వస్థత

- కర్ణాటక పర్యటనలో అమిత్ షాకు అస్వస్థత
- హుబ్బళ్లి పర్యటనలో అస్వస్థతకు గురైన అమిత్ షా
- మెడికల్ కళాశాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి గైర్హాజరు
- వైద్యుల సూచన మేరకు హోటల్‌లోనే విశ్రాంతి
- ఆయన స్థానంలో పాల్గొన్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

'స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో
యువతకు కొత్త అవకాశాలు'

రోజ్‌గార్ మేళాలో ప్రధాని మోదీ

20వ రోజ్‌గార్ మేళాలో 51 వేలకు పైగా నియామక పత్రాల పంపిణీ
దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో నిర్వహించిన ఉద్యోగ మేళా



2

మన ప్రజాపక్షం,ఢిల్లీ

2047నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలనే లక్ష్యం దిశగా భారత్ అడుగులు వేస్తోందని, ఇందులో యువత పాత్ర చాలా కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. భారత్ వివిధ దేశాలతో కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏలు) దేశ యువతకు కొత్త కెరీర్ అవకాశాలకు మార్గం సుగమం చేస్తున్నాయని అన్నారు. కొత్త మార్కెట్లకు భారత వ్యాపారులు చేరుకోవడంతో పాటు, యువతకు ఉద్యోగాలు, నైపుణ్యాల ఆధారంగా కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన 20వ రోజ్‌గార్ మేళాలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా యువతను ఉద్దేశించి ప్రధాని ఈ మేరకు మాట్లాడారు. ఈ సందర్భంగా 51వేల మందికి నియామకపత్రాలు అందజేశారు.భారత్ ఇప్పటివరకు వివిధ దేశాలతో 40 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకుందని ప్రధాని మోదీ తెలిపారు. వీటి ద్వారా భారత వ్యాపారులకు కొత్త భాగస్వామ్యాలు, కొత్త మార్కెట్లు అందుబాటులోకి వస్తున్నాయని

కేసీఆర్‌కు చెంపపెట్టు

మొదటి పేజీ తరువాయి

దానం నాగేందర్‌పై అనర్హత పిటిషన్ కేసులో కోర్టు ఇచ్చిన తీర్పు బీఆర్ఎస్, కేసీఆర్‌కు చెంపపెట్టు లాంటిదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల దుష్ట సంస్కృతిని ప్రవేశపెట్టిందే కేసీఆర్ అని తీవ్రంగా విమర్శించారు. కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని, ఎన్నిక జరిగితే ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం కాంగ్రెస్‌దేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు.“గతంలో టీడీపీ టికెట్‌పై గెలిచిన తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను, కాంగ్రెస్ టికెట్‌పై గెలిచిన సబిత ఇంద్రారెడ్డిని బీఆర్ఎస్‌లో చేర్చుకుని మంత్రి పదవులు ఇచ్చింది కేసీఆర్ కాదా?” అని ప్రశ్నించారు. కేసీఆర్ చర్యల వల్లే రాష్ట్రంలో ఫిరాయింపుల సంస్కృతి పెరిగిపోయిందని ఆరోపించారు.అదే సమయంలో బీజేపీపైనా ఆయన విమర్శలు గుప్పించారు. ప్రభుత్వాలను కూల్చివేయడం, పార్టీలను చీల్చడం బీజేపీకి అలవాటని అన్నారు. దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య వ్యవస్థను బీజేపీ నాశనం చేస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్, బీజేపీ ఇద్దరూ ఒకే తరహా రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

ధైర్యంగా పోరాడదామని
సీఎం రేవంత్ చెప్పారు

మొదటి పేజీ తరువాయి

పార్టీ ఫిరాయింపుల కేసులో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేస్తూ తీర్పును వెలువరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో దానం నాగేశ్వర్ మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కోర్టు తీర్పును తాను సమగ్రంగా చదివానని తెలిపారు. హైకోర్టు ఉత్తర్వులపై వ్యక్తిగతంగా సుప్రీంకోర్టుకు వెళ్లే ఉద్దేశం తనకు లేదని స్పష్టం చేశారు. ఈ అంశంపై అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాలా? వద్దా? అనేది పూర్తిగా అసెంబ్లీ స్పీకర్ తీసుకోవాల్సిన నిర్ణయమని వ్యాఖ్యానించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసినట్లు తెలిపిన దానం నాగేందర్... సీఎం తనను ‘నువ్వు ఫైటర్‌వి, ధైర్యంగా పోరాడదాం’ అని ప్రోత్సహించారని పేర్కొన్నారు. రాజకీయాల్లో ఎన్నికలు తనకు కొత్తేమీ కాదని, నియోజకవర్గ పరిధిలో క్షేత్రస్థాయి పోరాటాలు చేయడానికి, ఉపఎన్నికలను ఎదుర్కోవడానికి తాము, తమ పార్టీ కేడర్ సంపూర్ణంగా సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు.

ముమ్మాటికీ కాంగ్రెస్
మార్క్ కరవు

మొదటి పేజీ తరువాయి

రెడ్డి అసెంబ్లీలో పేర్కొనడం పచ్చి అబద్ధమని కొట్టిపారేశారు. వాస్తవానికి కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా ఇప్పటివరకు కేవలం 8 టీఎంసీల నీటిని మాత్రమే మళ్లించారని ఆయన స్పష్టం చేశారు. కల్వకుర్తి పథకంలోని ఐదు మోటార్లలో కేవలం రెండే పని చేస్తుండటం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.గత మూడేళ్లలో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) గణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ 718 టీఎంసీల నీటిని వినియోగించుకోగా, తెలంగాణ కేవలం 216 టీఎంసీలకే పరిమితమైందని ఆయన వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే అత్యంత తక్కువ స్థాయిలో కృష్ణా జలాలను వినియోగించుకోవడం అత్యంత విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు.“నీళ్లు అందుబాటులో ఉన్నాయి, ఎత్తిపోసేందుకు మోటార్లు సిద్ధంగా ఉన్నాయి. అయినప్పటికీ నీటిని మళ్లించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉంది. అందుకే ఇది కాలం తెచ్చిన కరవు కాదు, కాంగ్రెస్ తెచ్చిన కరవు” అని ఆయన ఎద్దేవా చేశారు. ఏపీ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు, వెలిగొండ ప్రాజెక్టుల ద్వారా అక్రమంగా నీటిని తరలించుకుపోతున్నా, తెలంగాణ ప్రభుత్వం మౌనంగా ఉండటం దారుణమని దుయ్యబట్టారు.

అమిత్ షాకు
అస్వస్థత

మొదటి పేజీ తరువాయి

కర్ణాటక పర్యటనలో ఉన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా శనివారం అస్వస్థతకు గురయ్యారు. దీంతో హుబ్బళ్లిలో ముందుగా నిర్ణయించిన కార్యక్రమానికి ఆయన హాజరు కాలేకపోయారు. వైద్యులు విశ్రాంతి తీసుకోవాలని సూచించడంతో ఆయన హోటల్‌కే పరిమితమయ్యారు.హుబ్బళ్లిలోని కేఎల్ఈ జగద్గురు గంగాధర్ మహాస్వామిగళు మూరుసవిర్మథ్ మెడికల్ కాలేజీ నూతన భవనాన్ని, 1,200 పడకల కేఎల్ఈ హాస్పిటల్ అండ్ మెడికల్ రీసెర్చ్ సెంటర్‌ను అమిత్ షా ప్రారంభించాల్సి ఉంది. రూ.700 కోట్ల వ్యయంతో ఈ మెడికల్ కాలేజీ భవనాన్ని నిర్మించారు. ఈ కార్యక్రమం నిమిత్తం షెడ్యూల్ ప్రకారమే శుక్రవారం రాత్రి ఆయన హుబ్బళ్లి చేరుకుని ఒక హోటల్‌లో బస చేశారు.అయితే, శనివారం ఉదయం ఆయన అనారోగ్యానికి గురికావడంతో ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. అమిత్ షా గైర్హాజరీలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, కర్ణాటక వైద్య విద్యా శాఖ మంత్రి శరణ్ ప్రకాశ్ పాటిల్, మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. అనారోగ్య కారణాల వల్లే అమిత్ షా ఈ కార్యక్రమానికి హాజరు కాలేకపోయారని కేఎల్ఈ సొసైటీ ఛైర్మన్ ప్రభాకర్ కోరే స్పష్టం చేశారు.

వికసిత్ భారత్ లక్ష్యంలో
తెలంగాణ కీలక పాత్ర

మొదటి పేజీ తరువాయి

ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుతం తెలంగాణ వాటా ఉన్న స్థాయి నుంచి 5 శాతం నుంచి 10 శాతానికి పెంచే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ఇందుకోసం కేవలం ప్రభుత్వ రుణాలపై ఆధారపడే విధానానికి పరిమితం కాకుండా ప్రైవేట్, సంస్థాగత పెట్టుబడులను పెద్ద ఎత్తున సమీకరించే దిశగా చర్యలు చేపడుతున్నామని వివరించారు. రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలను తీసుకురావడంతో పాటు యువతకు మెరుగైన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణ యువతే రాష్ట్రానికి అతిపెద్ద బలమని, వారి నైపుణ్యాలు, ప్రతిభను వినియోగించుకునేలా ఆర్థికాభివృద్ధి, ఉపాధి రంగాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకూ సమతుల్య అభివృద్ధి ఫలాలు అందేలా CURE-PURE-RARE విధానాన్ని అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. సుమారు 30 వేల ఎకరాల విస్తీర్ణంలో భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయడం ద్వారా భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కొత్త ఆర్థిక, పారిశ్రామిక అవకాశాలను సృష్టించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రైవేట్ పెట్టుబడుల సమీకరణకు మరింత ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు. దేశాభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు కేంద్రం.. రాష్ట్రాలు సహకార సమాఖ్య స్ఫూర్తితో కలిసి పనిచేయాలని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కేంద్రం--రాష్ట్రాల మధ్య సమన్వయం, పెట్టుబడుల ప్రోత్సాహం, యువతకు అవకాశాల కల్పనతో తెలంగాణను వేగవంతమైన ఆర్థికాభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

కాన్వాయ్ ఆపి సాయం

మొదటి పేజీ తరువాయి

ప్రమాదాన్ని గమనించిన ఆయన, వెంటనే తన కాన్వాయ్‌ను నిలిపివేసి సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ప్రమాదానికి గురైన బాధితులను తన భద్రతా వాహనంలోనే ఆసుపత్రికి తరలించి అండగా నిలిచారుశనివారం సిద్దిపేట నుంచి గజ్వేల్ వైపు వెళుతున్న ఒక కారు రాజీవ్ రహదారిపై అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదం సమయంలో ఎయిర్ బ్యాగులు తెరుచుకోవడంతో కారు నడుపుతున్న వ్యక్తి, ముందు సీటులో ఉన్న ఆయన భార్య స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అయితే, వెనుక సీటులో కూర్చున్న వారి కుమార్తెకు తల, ముక్కు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి.అదే సమయంలో సిరిసిల్ల వైపు వెళుతున్న బండి సంజయ్ ఈ ప్రమాదాన్ని గమనించారు. వెంటనే తన వాహనాన్ని ఆపి, భద్రతా సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. కారులో చిక్కుకున్న బాధితులను బయటకు తీయడంలో స్వయంగా సహాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన బాలికను, ఆమె తల్లిదండ్రులను వెంటనే తన కాన్వాయ్‌లోని భద్రతా వాహనంలో ఆసుపత్రికి తరలించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సూచించారు. ఆపదలో ఉన్నవారిని సకాలంలో ఆదుకున్న బండి సంజయ్ చొరవను పలువురు అభినందించారు.

పేర్లను సూచించండి

మొదటి పేజీ తరువాయి

క్షేత్రస్థాయిలో కల రూపుదిద్దుకుంటోందని పేర్కొన్నారు.ఇది కేవలం విమానాశ్రయం మాత్రమే కాదని, పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉద్యోగాలు పెట్టుబడులకు కొత్త గేట్‌వే అని రేవంత్ రెడ్డి అభివర్ణించారు. అభివృద్ధి చెందుతున్న, అనుసంధానించబడిన తెలంగాణ రాష్ట్రానికి కొత్త చిహ్నంగా నిలవనున్న వరంగల్ మామునూరు విమానాశ్రయం నుంచి ప్రయాణించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు.

రెండు పేర్లను సూచించిన సందీప్ రెడ్డి వంగా

సొంతూరు వరంగల్?కు అంతర్జాతీయ విమానాశ్రయం రావడం ఎంతో సంతోషంగా ఉందని డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా తెలిపారు. విమానాశ్రయానికి తాను రెండు పేర్లను సూచించాలనుకుంటున్నానని అన్నారు. “రుద్రమ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్, కాకతీయ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్” అని సూచించారు. విమానాశ్రయానికి వరంగల్ ఘనమైన వారసత్వాన్ని, సాంస్కృతిక స్ఫూర్తిని ప్రతిబింబించే పేరును పెట్టడం నిజంగా ఎంతో అర్థవంతంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఇందుకు కృషి చేసి, విమానాశ్రయం కలను వాస్తవంలోకి తెచ్చిన గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

పర్యావరణ అనుమతులే ఆలస్యం

రేవంత్ రెడ్డి ఇటీవల దిల్లీ వెళ్లిన సందర్భంలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడితో భేటీ అయ్యారు. మామునూరు విమానాశ్రయం ఏర్పాటులో మిగిలిన పనులు వేగంగా పూర్తి చేయాలని కోరారు. దీంతో సానుకూలంగా స్పందించిన రామ్మోహన్‌నాయుడు, ఎయిర్‌పోర్ట్ అథారిటీ అధికారులతో సమీక్ష చేశారు. పర్యావరణ అనుమతుల అంశం కూడా చర్చకు వచ్చింది. ఇప్పటికే ఏఏఐ అధికారులు సంబంధిత పత్రాలతో దరఖాస్తు సమర్పించిన నేపథ్యంలో త్వరగా ఆ ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పారు.



‘స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో
యువతకు కొత్త అవకాశాలు’

మొదటి పేజీ తరువాయి

చెప్పారు. అదే సమయంలో యువతకు కెరీర్‌లో కొత్త మార్గాలు తెరుచుకుంటున్నాయని పేర్కొన్నారు. భారత యువత నైపుణ్యాలు, ప్రతిభపై ప్రపంచ దేశాల్లో విశ్వాసం పెరుగుతోందని మోదీ అన్నారు. ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలు, యువత నుంచి ప్రపంచానికి భారీ అంచనాలు ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వ సేవల్లో చేరుతున్న యువత ప్రతి నిర్ణయంలోనూ దేశాన్ని అభివృద్ధి, స్వావలంబన దిశగా తీసుకెళ్లే ఆలోచనను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. యువతకు ఇతర యువత పట్ల ప్రత్యేక బాధ్యత ఉందని చెప్పారు.

బ్రిక్స్‌లోనూ యువత భాగస్వామ్యం

ఇటీవల ముగిసిన బ్రిక్స్ సదస్సును ప్రధాని మోదీ ప్రస్తావించారు. బ్రిక్స్ సహకారం కేవలం ప్రభుత్వాలకే పరిమితం కాకూడదని అన్నారు. భారత పారిశ్రామికవేత్తలు, రైతులు, మహిళలు, యువత కూడా ఈ భాగస్వామ్యంలో చురుకైన భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. అంతర్జాతీయ వేదికలపై భారత్ పాత్ర పెరుగుతున్న నేపథ్యంలో దేశ యువత తమ నైపుణ్యాలను మరింతగా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.

‘నాగరిక్ దేవో భవ’ స్ఫూర్తితో సేవ

ప్రతి రంగంలోనూ శరవేగంగా మార్పులు జరుగుతున్నాయని ప్రధాని మోదీ అన్నారు. ‘నిరంతరం నేర్చుకుంటూనే మీరు ఈ స్థాయికి చేరుకున్నారు. ఇక్కడి నుంచి మళ్లీ కొత్త విషయాలు నేర్చుకునే సరికొత్త ప్రయాణం ప్రారంభమవుతుంది. మీరు ఎల్లప్పుడూ మీ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి. కొత్త సాంకేతికతను, కొత్త వ్యవస్థలను అర్థం చేసుకోవాలి. ‘మిషన్ కర్మయోగి’ఈ లక్ష్యాన్ని చేరుకోవటంలో మీకు సాయపడుతుంది. ప్రభుత్వం అసలైన బలం పౌరులకు దానిపై ఉన్న నమ్మకమే. ఆ నమ్మకం ఎలా వస్తుందంటే.. పౌరులకు ప్రభుత్వంతో ఎలాంటి అనుభవం ఎదురైందనే దాన్ని వల్ల వస్తుంది. ప్రభుత్వ సేవలో మన తారకమంత్రం ఒక్కటే కావాలి. ‘నాగరిక్ దేవో భవ’. పౌరులకు సేవ చేయడమంటే దేశానికి సేవ చేయడమే. మీ పనితీరు వల్ల ఏ పౌరుడి జీవితమైనా సులభతరమైతే, అప్పుడే మీ విజయం మరింత ఉన్నతస్థాయికి చేరుకుంటుంది’ అని ప్రధాన మోదీ పేర్కొన్నారు.

51 వేల మందికి పైగా నియామక పత్రాలు

20వ రోజ్‌గార్ మేళాలో భాగంగా 51 వేల మందికి పైగా కొత్తగా నియమితులైన యువతకు నియామక పత్రాలు అందించారు. దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తగా ఎంపికైన అభ్యర్థులు రెవెన్యూ విభాగం, రైల్వేలు, హోం వ్యవహారాలు, ఆరోగ్యం-కుటుంబ సంక్షేమం, ఆర్థిక సేవలు, రక్షణ తదితర కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో విధుల్లో చేరనున్నారు. ఈ 20వ రోజ్‌గార్ మేళాతో కలిపి ఇప్పటివరకు వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో సుమారు 12.75 లక్షల మంది యువతకు నియామక పత్రాలు అందినట్లు ప్రధాని కార్యాలయం వెల్లడించింది.

సుప్రీంకోర్టును ఆశ్రయించిన
దానం నాగేందర్

మొదటి పేజీ తరువాయి

నాగేందర్‌పై శుక్రవారం హైకోర్టు అనర్హత వేటు వేసిన విషయం విదితమే. సాంకేతికంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడం పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కిందకు వస్తుందని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు ఆయన శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ తీర్పునిచ్చింది.ఈ అనర్హత 2024 ఏప్రిల్ 23వ తేదీ నుంచే వర్తిస్తుందని న్యాయస్థానం తన తీర్పులో పేర్కొంది. దానం నాగేందర్‌పై దాఖలైన అనర్హత పిటిషన్లను తిరస్కరిస్తూ గతంలో స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు కొట్టివేసింది. ఈ తీర్పుతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లుగా పరిగణించాలని, తీర్పు ప్రతులను స్పీకర్ కార్యాలయానికి, ఎన్నికల సంఘానికి పంపాలని ఆదేశాలు జారీ చేసింది.మరోవైపు, ఇదే వ్యవహారంలో బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ అంశంపై తమ వాదనలు వినకుండా ఎలాంటి ఏకపక్ష నిర్ణయం తీసుకోవద్దని వారు అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు.

జన్వాడ ఫాంహౌస్

మొదటి పేజీరువాయి

రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం జన్వాడలోని వివాదాస్పద ఫాంహౌస్‌ను (కేటీఆర్ ఫాంహౌస్ గా ఆరోపణలు) కాంగ్రెస్ పార్టీకి చెందిన పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యుల బృందం ఈరోజు నేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీఆర్ఎస్ కార్యకర్తలు నిరసనకు దిగి కాంగ్రెస్ బృందాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ పరిశీలన అనంతరం మాట్లాడిన నాగర్ కర్నూలు ఎంపీ మల్లు రవి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి... జన్వాడ ఫాంహౌస్ నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేవని, మురుగునీటి కాలువ (నాలా) పైనే ఈ అక్రమ నిర్మాణాన్ని చేపట్టారని సంచలన ఆరోపణలు చేశారు.ఇంత పెద్ద ఎత్తున నిబంధనలకు విరుద్ధంగా విస్తరించిన ఈ ఫాంహౌస్ భూముల వెనుక పెద్ద ఎత్తున అక్రమాలు దాగి ఉన్నాయని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. కేటీఆర్ స్నేహితుడైన ప్రదీప్ రెడ్డి పేరుతో ఈ భూములు ఉన్నప్పటికీ, అసలు యజమానులెవరనే దానిపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు.గతంలో సత్యం రామలింగరాజుకు చెందిన భూముల్లోనే ఈ ఫాంహౌస్ నిర్మించారని, శతబిష ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ పేరుతో ఉన్న ఈ స్థలాల్లో కేటీఆర్ అర్ధాంగి శైలిమతో పాటు ఆయన అత్తగారి పేరిట కూడా భూములు ఉన్నాయని ఆరోపించారు. కేటీఆర్ మున్సిపల్ మంత్రిగా ఉన్న హయాంలో తన అధికార దుర్వినియోగానికి పాల్పడి ఈ అక్రమ నిర్మాణాన్ని ప్రోత్సహించారని, గతంలో ఈ ఫాంహౌస్ దగ్గర డ్రోన్ కెమెరా ఎగురవేసినందుకు రేవంత్ రెడ్డిపై అక్రమ కేసులు బనాయించిన విషయాన్ని ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు గుర్తుచేశారు.





శ్రీశైలం వెళ్తున్న బస్సు,టిప్పర్ ఢీ

ఘటన స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్
ప్రయాణికుల భద్రతపై అధికారులను అడిగి తెలుసుకున్న జిల్లా కలెక్టర్

నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం:
నాగర్‌కర్నూల్ పట్టణంలోని బస్సు డిపో సమీపంలో శనివారం తాండూర్ నుంచి శ్రీశైలం వెళ్తున్న ఆర్టీసీ బస్సు, టిప్పర్ ఢీకొన్న ఘటన చోటుచేసుకుంది. అదే సమయంలో అటుగా వెళ్తున్న జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఘటనను గమనించి వెంటనే అక్కడికి చేరుకుని ప్రమాద స్థలాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికుల పరిస్థితిపై కలెక్టర్ ఆరా తీశారు. ప్రయాణికులకు ఏమైనా ప్రమాదం సంభవించిందా, ఎవరికైనా గాయాలయ్యాయా అనే వివరాలను అక్కడున్న అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికుల భద్రతకు సంబంధించి తీసుకున్న చర్యలను కూడా అధికారులను అడిగి తెలుసుకున్నారు.బస్సు, టిప్పర్ డ్రైవర్లకు స్వల్ప గాయాలైనట్లు ట్రాఫిక్ ఎస్ఐ, సంబంధిత అధికారులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు.గాయపడిన వారికి అవసరమైన వైద్య సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.ప్రమాదం కారణంగా రహదారిపై ఏర్పడిన పరిస్థితులను కలెక్టర్ పరిశీలించి, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై వివరాలను తెలుసుకున్నారు.ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ, ప్రమాదాలు చోటుచేసుకోకుండా రహదారి భద్రతా నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.



ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

చిలుకూరు, మన ప్రజాపక్షం:
మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నో బ్యాగ్ డే సందర్భంగా విద్యార్థులకు చేతివృత్తులు వాటి పరిచయాలు, జానపద నృత్యాలు, వ్యాసరచన పోటీలు, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అదేవిధంగా విద్యార్థులకు స్కిల్ డెవలప్మెంట్, వ్యక్తిగత పరిశుభ్రత స్వయం పరిపాలన తదితర విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన డాక్టర్ సజ్జనకుమారి, కైలాస వెంకటేశ్వర్లు,అమీదా, క్రాఫ్ట్ టీచర్ ఎం.ఝాన్సీ రాణిలను సన్మానించి నట్లు ప్రధానోపాధ్యాయులు రాజారామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోదండరామయ్య, ఆదినారాయణ, రవికుమార్,రామారావు, శాంసన్ రామకృష్ణ,అప్పారావు,రేణుక,కృష్ణ, సిఆర్పి కవిత,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట పట్టణ బంద్ కు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదములు



సూర్యాపేట,మన ప్రజాపక్షం:
సూర్యాపేట పట్టణంలో శుక్రవారం జరిగిన బంద్ కు పూర్తిగా సహకరించిన వర్తక వ్యాపార వర్గాలకు,హోటల్స్ యజమానులకు, మెకానిక్ లకు, లాయర్స్ కు బందులో పాల్గొన్న ప్రతి ఒక్కరికి బుల్లెట్ ట్రైన్ సాధన సమితి జేఏసీ ధన్యవాదాలు తెలిపింది. శనివారం సుధా బ్యాంకు ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎండలను కూడా లెక్క చేయకుండా పెద్ద ఎత్తున అన్ని వర్గాల ప్రజలు బందులో పాల్గొన్నారని తెలిపారు. సూర్యాపేట ప్రజల ఐకమత్యాన్ని ఈ బంద్ ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేశామని, బంద్ కు మద్దతుగా నిలిచిన పాఠశాల కళాశాలల యజమానులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఉపాధ్యాయ సంఘాలు, బీసీ సంఘాలు, ప్రజా సంఘాలకు ధన్యవాదాలు తెలియజేశారు. బంద్ లో బ్యాంకులు, కార్పొరేట్ సంస్థలు షాపింగ్ మాల్స్ కూడా స్వచ్ఛందంగా బంద్ లో పాల్గొన్నారని చెప్పారు.సూర్యాపేట బంద్ బుల్లెట్ ట్రైన్ సాధనలో ఒక కీలకమైన సంఘటన అని ఈ సందర్భంగా పలువురు నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పెద్దిరెడ్డి రాజా, నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మల్లు, నాగార్జున రెడ్డి,నెమ్మది వెంకటేశ్వర్లు, బూర వెంకటేశ్వర్లు,మందాడి డేవిడ్,కొత్తపల్లి శివకుమార్,చల్లమల్ల నరసింహ, సలిగంటి వీరేంద్ర,ఎల్గూరి రామ్మూర్తి, కర్నాటి కిషన్, పెద్దిరెడ్డి గణేష్,బుల్లెట్ ట్రైన్ సాధన సమితి కన్వీనర్ ఆరుట్ల జానకిరామిరెడ్డి,భూపతి రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలి

వాతావరణం, మార్కెట్‌కు అనుగుణంగా ఆరుతడి పంటల ఎంపికపై దృష్టి సారించాలి
శాస్త్రీయ సాగు విధానాలతో వ్యవసాయంలో అధిక లాభాలు సాధించాలి
కిసాన్ మేళాను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్





నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం
:రైతులు ఆధునిక వ్యవసాయ సాంకేతికతను అందిపుచ్చుకొని సాగు ఖర్చులను తగ్గించుకుంటూ అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం సాధించే దిశగా ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సూచించారు.శనివారం పాలెంలోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం కృషి విజ్ఞాన కేంద్రంలో జిల్లా వ్యవసాయ శాఖ, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆత్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కిసాన్ మేళా, రైతు–శాస్త్రవేత్తల సమావేశం, వ్యవసాయ ప్రదర్శనను రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులు ఏవీఎన్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శనను కలెక్టర్ పరిశీలించారు. వివిధ పంటల సాగు విధానాలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయ యంత్ర పరికరాలు, పంటల సంరక్షణ పద్ధతులపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.రైతులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ భూమి స్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులు, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. పంటల సాగుకు ముందు తప్పనిసరిగా నేల పరీక్షలు చేయించుకొని భూసారానికి అనుగుణంగా ఎరువులను వినియోగించాలని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో నెలకొన్న తీవ్రమైన వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రానున్న రబీ సీజన్‌లో రైతులు వరి సాగుకు దూరంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. తక్కువ నీటితో సాగు చేయగల పంటలు, పంటల వైవిధ్యీకరణపై వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు తీసుకోవాలని కోరారు.అవసరానికి మించి రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగించడం వల్ల సాగు ఖర్చులు పెరగడంతో పాటు నేల సారవంతత దెబ్బతినే అవకాశం ఉందన్నారు. శాస్త్రీయ పద్ధతుల్లో ఎరువులు, పురుగుమందులను వినియోగిస్తూ సమగ్ర సస్యరక్షణ విధానాలను పాటించాలని సూచించారు.వ్యవసాయంలో యాంత్రీకరణకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు సూక్ష్మ సాగునీటి, ఆధునిక నీటి యాజమాన్య పద్ధతులు, సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ విధానాలపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. రైతులు కేవలం పంటల ఉత్పత్తిపైనే కాకుండా నాణ్యత, నిల్వ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ అంశాలపై కూడా దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయడం, రైతు సమూహాలుగా ఏర్పడి ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోవడం, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు.వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు అందించే సాంకేతిక సలహాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, పంటల సాగులో ఎదురయ్యే సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి శాస్త్రీయ పరిష్కారాలు పొందాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ వ్యవసాయ, సంక్షేమ పథకాలను అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకునేలా అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు.రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులు ఏవీఎన్ రెడ్డి మాట్లాడుతూ రైతులు పంటల సాగుకు ముందు పూర్తిస్థాయి అవగాహన కల్పించుకోవాలని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ పంటల మార్పిడి విధానాన్ని పాటించాలని సూచించారు. ప్రభుత్వం అందించే సబ్సిడీని అందిపుచ్చుకొని లాభదాయకమైన వ్యవసాయానికి బదిలీ కావాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.కిసాన్ మేళాలో నిర్వహించిన రైతు–శాస్త్రవేత్తల సమావేశంలో రైతులు తమ పంటల సాగులో ఎదుర్కొంటున్న సమస్యలను శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్లారు. తెగుళ్లు, చీడపీడల నివారణ, ఎరువుల వినియోగం, అధిక దిగుబడుల సాధన, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక తదితర అంశాలపై శాస్త్రవేత్తలు సూచనలు అందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, పాలెం ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ కృష్ణ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి వెంకటేశం, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జ్ఞానశేఖర్, జిల్లా భూగర్భ జల అధికారిణి దివ్యజ్యోతి, అడిషనల్ డీఆర్‌డీఓ రాజేశ్వరి, కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ శైల, వ్యవసాయ శాఖ అధికారులు, ఆత్మ అధికారులు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు, సంబంధిత శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మతాలు వేరైనా.. మనసులు ఒక్కటే..!

మత సామరస్యానికి చిరునామాగా జనగామ
గణేష్ మహారాజ్‌ను పూజించినా.. అల్లాహ్‌ను ప్రార్థించినా.. కోరేది ప్రజల శ్రేయస్సే
సేవా స్ఫూర్తికి ప్రతీకగా అన్నదానం
వినాయకుడి ఆశీస్సులతో ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలి
వినాయక నవరాత్రి వేడుకల్లో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

జనగామ, మన ప్రజాపక్షం:
జనగామ జిల్లా కేంద్రంలోని 7వ, 10వ వార్డుల్లో ఏర్పాటు చేసిన గణనాథుడి మండపాలను శనివారం జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నం వడ్డించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ జనగామ నియోజకవర్గ ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు..విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.పండుగలు ప్రజలను మరింత దగ్గర చేసే వేదికలు..భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహించుకోవడం ఆనందంగా ఉంది అని అన్నారు.మత సామరస్యానికి జనగామ ప్రతీక.. హిందూ, ముస్లిం సోదరులు కలిసిమెలిసి పండుగలు జరుపుకోవడం అభినందనీయం అని తెలిపారు. 7వ వార్డులో సాజిద్ భాయ్ నాయకత్వంలో ముస్లిం సోదరులు స్వయంగా వచ్చి హిందూ సోదరులకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేయడం, ఉత్సవాల్లో భాగస్వాములు కావడం సర్వమత సౌభ్రాతృత్వానికి నిదర్శనం.మనుషులందరం ఒక్కటే. మత విశ్వాసాలు వేర్వేరుగా ఉన్నప్పటికీ సమాజంలో శాంతి, సుఖసంతోషాలు, అభివృద్ధి ఉండాలన్నదే అందరి ఆకాంక్ష..అల్లాహ్‌ను ప్రార్థించినా.. గణేష్ మహారాజ్‌ను పూజించినా.. ప్రజలం దరికీ మంచి జరగాలని, సమాజ శ్రేయస్సు కలగాలని కోరుకోవడమే మనందరి లక్ష్యం అని అన్నారు.పండుగల సందర్భంగా కనిపిస్తున్న శాంతి, సద్భావన, సోదరభావం నిరంతరం కొనసాగాలి అని అన్నారు.అన్నదానం గొప్ప సేవా కార్యక్రమం భక్తులతో కలిసి అన్నదానంలో పాల్గొని స్వయంగా అన్నం వడ్డించడం సంతోషంగా ఉంది.జనగామ నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురా రోగ్యాలతో ప్రశాంతంగా జీవించాలని ఆకాంక్షిస్తున్నాను.వినాయక మహారాజ్ ఆశీస్సులతో ప్రతి ఇంటా శుభం,జనగామ నియోజకవర్గంలో శాంతి, సౌభ్రాతృత్వాలు వెల్లివిరియాలని మనస్పూ ర్తిగా కోరుకుంటున్నాను అని తెలిపారు.





గురుకులాల్లో పేద విద్యార్థుల ప్రాణాలకు విలువ లేదా?

గురుకుల కళాశాలను జిల్లా కలెక్టర్ సందర్శించాలి

నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం:నాగర్ కర్నూల్ జిల్లా శ్రీపురం గ్రామంలోని మహాత్మా జ్యోతిబా ఫూలే గురుకుల కళాశాలలో విద్యార్థుల భద్రత,వసతుల పరిస్థితి, సిబ్బంది వ్యవహారశైలిపై తీవ్ర ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్, ఎంజేపీ గురుకులాల కార్యదర్శి తక్షణమే కళాశాలను సందర్శించి సమగ్ర విచారణ చేపట్టాలని బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) డిమాండ్ చేసింది. బీఎస్పీ ఆధ్వర్యంలో శ్రీపురంలోని మహాత్మా జ్యోతిబా ఫూలే గురుకుల కళాశాలను పార్టీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బోనాసి రాంచందర్ అడ్వకేట్,పార్లమెంట్ ఇంచార్జ్ సి. కళ్యాణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్ మాట్లాడుతూ విద్యార్థి భరత్ యాదవ్ ఆత్మహత్య ఘటనపై సమగ్ర విచారణ జరిపి,బాధ్యులుగా తేలిన వారిపై చట్టపరమైన మరియు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల నుంచి తమ దృష్టికి వచ్చిన వివరాల ప్రకారం, లెక్చరర్ ప్రభాకర్ రెడ్డి విద్యార్థులను తీవ్రంగా వేధించేవారని,కొట్టడం,తన్నడం,బెంచీల మధ్యలో వేసి కొట్టడం వంటి ఆరోపణలు ఉన్నాయని నాయకులు తెలిపారు.విద్యార్థులపై ఇలాంటి ప్రవర్తన జరిగిందన్న ఆరోపణలపై అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు.అదేవిధంగా లెక్చరర్ శంకర్ వ్యవహారశైలిపై కూడా విద్యార్థుల నుంచి ఫిర్యాదులు తమ దృష్టికి వచ్చాయని బీఎస్పీ నాయకులు తెలిపారు.విద్యార్థులు తమ సమస్యలను ప్రిన్సిపాల్‌కు స్వేచ్ఛగా చెప్పుకోలేని పరిస్థితి ఉందని ఆరోపించారు.భరత్ యాదవ్ మృతికి సంబంధించి తోటి విద్యార్థులు తమకు వెల్లడించిన విషయాలను కూడా నాయకులు ప్రస్తావించారు.అయితే ఈ ఆరోపణలన్నింటిపై అధికారికంగా సమగ్ర విచారణ జరిపి నిజానిజాలను నిర్ధారించాలని వారు డిమాండ్ చేశారు.శ్రీపురం గురుకుల కళాశాలలో విద్యార్థులకు కనీస భద్రతా వసతులు కూడా సరిగా లేవని బీఎస్పీ నాయకులు ఆరోపించారు.కిటికీలకు తలుపులు లేకపోవడం,బాత్‌రూమ్‌లలో లైట్లు లేకపోవడం,హాస్టల్ చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడం వంటిజ సమస్యలను వారు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.అదేవిధంగా పాము కాటుకు గురైన ఓ విద్యార్థి ప్రస్తుతం నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, బాత్‌రూమ్‌లో తగిన వెలుతురు లేకపోవడం వల్లే ఈ ఘటన జరిగిందని తమకు సమాచారం అందిందని నాయకులు తెలిపారు. ఈ ఘటనపై కూడా అధికారులు విచారణ జరిపి బాధ్యత ఎవరిదో తేల్చాలని కోరారు.విద్యార్థులపై వేధింపులకు సంబంధించిన ఆరోపణలు నిజమని విచారణలో తేలితే, లెక్చరర్ ప్రభాకర్ రెడ్డిని సర్వీస్ నుంచి తొలగించడంతో పాటు, విధుల్లో నిర్లక్ష్యం వహించినట్లు తేలితే ప్రిన్సిపాల్ కవిత, లెక్చరర్ శంకర్ తదితరులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని బీఎస్పీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎంజేపీ ఆర్సీఓ శ్రీనివాస్ గౌడ్ కి బీఎస్పీ నాయకులు వినతి పత్రం సమర్పించారు.జిల్లా కలెక్టర్,ఎంజేపీ గురుకులాల కార్యదర్శి స్వయంగా శ్రీపురం గురుకుల కళాశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి, వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థి భరత్ యాదవ్ మృతికి సంబంధించిన అంశంతో పాటు గురుకులంలో విద్యార్థుల భద్రత,వసతుల సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు.బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే బీఎస్పీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఈసీ సభ్యులు శ్రీ హర్ష ముదిరాజ్,శాయిన్ పేట్ రాములు,నాయకులు దేవరపాగ రాముడు, జన్ను ఆంజనేయులు, అర్జున్, మహేష్ యాదవ్,ఆంజనేయులు, కె.రాములు,శ్రీనువాసులు, మల్లేష్, బీవీఎఫ్ అసెంబ్లీ కన్వీనర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.




జిల్లా ఎస్సీ/ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్

కమిటీ సభ్యత్వానికి నోటిఫికేషన్ విడుదల

జనగామ, మన ప్రజాపక్షం:జనగామ జిల్లా పరిధిలోని అర్హులైన నివాసుల నుండి జిల్లా స్థాయి విజిలెన్స్ మరియు మానిటరింగ్ కమిటీ లో అధికారేతర సభ్యుల నియామకం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి తెలిపారు. ఎస్సీలు మరియు ఎస్టీలు (ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీస్) రూల్స్, 1995 లోని రూల్ 17 ప్రకారం, జిల్లా కలెక్టర్ ఉ జిల్లా మేజిస్ట్రేట్ అధ్యక్షతన ఈ కమిటీ ఏర్పాటవుతుందని పేర్కొన్నారు. జిల్లాలో ఎస్సీ /ఎస్టీ అఘాయిత్యాల నిరోధక చట్టం అమలును సమీక్షించడం, బాధితులకు ఉపశమనం, పునరావాసం కల్పించడం మరియు కేసుల ప్రాసిక్యూషన్‌ను పర్యవేక్షించడం ఈ కమిటీ ప్రధాన బాధ్యతలని వెల్లడించారు. ?ఈ నియామకాలలో భాగంగా రెండు సంవత్సరాల పదవీకాలానికి గౌరవ ప్రాతిపదికన సభ్యులను ఎంపిక చేస్తారని స్పష్టం చేశారు. మొత్తం స్థానాల్లో షెడ్యూల్డ్ కులాలు మరియు షెడ్యూల్డ్ తెగలకు చెందిన ఐదుగురు సభ్యులకు అవకాశం ఉంటుందని, ప్రస్తుతం వీటిలో ఎస్సీ(ఏ) మరియు ఎస్సీ(సి) ఉపవర్గాల ఖాళీలు ఉన్నాయని తెలిపారు. వీరు కాకుండా ఎస్సీ /ఎస్టీ సంక్షేమం కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థల (ఎన్జీవో)తో అనుబంధం ఉన్న ఇతర వర్గాల నుండి గరిష్టంగా ముగ్గురు సభ్యులను నియమించే వెసులుబాటు ఉందని వివరించారు.?దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తప్పనిసరిగా జనగామ జిల్లా స్థానిక నివాసులై ఉండాలని, సమర్థ అధికారి జారీ చేసిన కుల (ఉపవర్గంతో కూడిన) మరియు నివాస ధృవీకరణ పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. అభ్యర్థులకు ఎస్సీ /ఎస్టీ సంక్షేమం లేదా సామాజిక సేవా రంగంలో నిరూపితమైన అనుభవం ఉండాలని తెలిపారు. అంతేకాకుండా, ఎలాంటి క్రిమినల్ కేసులు లేదా నైతిక పతనానికి సంబంధించిన నేరారోపణలు ఉండకూడదని, ఏ రాజకీయ పార్టీలోనూ పదాధికారిగా ఉండకూడదని షరతులు విధించారు.ఆసక్తి గల అభ్యర్థులు నిర్దేశిత దరఖాస్తు నమూనాను జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయం నుండి కానీ, జిల్లా అధికారిక వెబ్‌సైట్ నుండి కానీ పొందవచ్చని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తుతో పాటు బయోడేటా, కుల, నివాస ధృవీకరణ పత్రాలు, ఇద్దరు వ్యక్తుల రిఫరెన్సులు, సమ్మతి ప్రకటన మరియు క్రిమినల్ పూర్వచరిత్రకు సంబంధించిన స్వీయ ధృవీకరణ పత్రాలను జతచేసి, సెప్టెంబర్ 24, 2026 సాయంత్రం 5:00 గంటల లోపు తమ కార్యాలయంలో సమర్పించాలని కోరారు. ?అందిన దరఖాస్తులను అదనపు కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ పరిశీలిస్తుందని, ఆ తర్వాత కమిషనర్ ఆఫ్ పోలీస్ ద్వారా అభ్యర్థుల పూర్వచరిత్రను ధృవీకరించుకుని, జిల్లా కలెక్టర్ ద్వారా తుది ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తారని వెల్లడించారు. ఎంపిక ప్రక్రియలో ఎలాంటి పైరవీలకు తావులేదని, కేవలం దరఖాస్తు చేసినంత మాత్రాన నియామకపు హక్కు లభించదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా డిండి ప్రాజెక్టుకు తక్షణమే నీరు విడుదల చేయాలి

కల్వకుర్తి, మన ప్రజాపక్షం :డిండి ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో సుమారు 12,500 ఎకరాల్లో సాగవుతున్న వరి పంటకు నీటి కొరత ఏర్పడిన నేపథ్యంలో,కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా డిండి ప్రాజెక్టులోకి తక్షణమే నీటిని విడుదల చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.బీజేపీ మండల అధ్యక్షులు సింకారు సైదాజీ నాయకత్వంలో బీజేపీ నాయకులు గుడిపల్లి మోటార్లు, చెట్ల చెన్నారం ఎస్కెఎఫ్ ప్రాంతం,నార్లపూర్ కేఎల్ఐ మెయిన్ పంప్‌హౌస్‌లను సందర్శించి నీటి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి పంటలకు ఎదురవుతున్న నీటి సమస్యను తెలుసుకున్నారు.వరి పంటకు కీలకమైన సమయంలో సాగునీరు అందకపోతే వేలాది ఎకరాల పంట దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని బీజేపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు పంటలు వేసుకున్న తర్వాత నీటి కోసం ఇబ్బందులు పడే పరిస్థితి రావడం ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని వారు విమర్శించారు.డిండి ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు సాగునీరు అందించేందుకు గతంలో కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా డిండి ప్రాజెక్టులోకి నీటిని తీసుకువచ్చిన విషయాన్ని వారు గుర్తుచేశారు.డిండి ప్రాజెక్టుకు కల్వకుర్తి ఎత్తిపోతల అనుసంధానం,గుడిపల్లి గట్టు రిజర్వాయర్ వ్యవస్థకు సంబంధించిన వివరాలు ప్రభుత్వ పత్రాల్లో కూడా ఉన్నాయని తెలిపారు.శ్రీశైలం జలాశయంలో నీటి లభ్యత,కల్వకుర్తి ఎత్తిపోతల నిర్వహణ,



డిండి ప్రాజెక్టు అవసరాలను సమన్వయం చేసి రైతులకు ప్రయోజనం కలిగేలా ప్రభుత్వం తక్షణమే నీటి విడుదలపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఇటీవల కల్వకుర్తి ఎత్తిపోతల మోటార్ల నిర్వహణపై కూడా రాజకీయంగా చర్చ జరిగిన విషయాన్ని వారు ప్రస్తావించారు.స్థానిక ఎమ్మెల్యే రైతుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి,సంబంధిత అధికారులతో సమన్వయం చేసి డిండి ప్రాజెక్టుకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.కేవలం హామీలకు పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో నీరు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు.రైతు పంట చేతికొచ్చే వరకు ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించాలి.12,500 ఎకరాల వరి పంటను కాపాడేందుకు ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని,కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా డిండి ప్రాజెక్టులోకి అవసరమైన నీటిని విడుదల చేయాలి.లేనిపక్షంలో రైతులకు జరిగే పంట



నష్టానికి రాష్ట్ర ప్రభుత్వం,స్థానిక ప్రజాప్రతినిధులే బాధ్యత వహించాల్సి ఉంటుంది" అని బీజేపీ నాయకులు హెచ్చరించారు.రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని తక్షణమే నీటిని విడుదల చేయాలని, నీటి సరఫరాపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని,డిండి ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు భరోసా కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని స్థానిక ఎమ్మెల్యేను బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కేతావత్ లాలూ నాయక్, నక్క వెంకటేష్ యాదవ్,బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వానం నరేందర్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ ఏ.టీ.కృష్ణ, ఐటీ సెల్ జిల్లా కన్వీనర్ జల్దా భాస్కర్,మాధవరం నరసింహారావు,చల్లమళ్ళ ప్రవీణ్ కుమార్, వావిళ్ల అంజి యాదవ్,పున్న దినేష్,కందుకూరు సర్పంచ్ బరపటి కొండల్, డిండి వార్డు మెంబర్ మాధమూని అమృత్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రాజీ మార్గం ద్వారా లోక్ అదాలత్ కేసుల పరిష్కారం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు

నారాయణపేట, మన ప్రజాపక్షం :రాజీమార్గం ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు లోక్ అదాలత్ ఎంతో సమర్థవంతమైన వేదిక అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు అన్నారు. నారాయణపేట జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కోఆర్డినేషన్ మరియు పోలీస్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 12న నిర్వహించనున్న నాలుగోవ జాతీయ లోక్ అదాలత్ను విజయవంతం చేసేందుకు అన్ని విభాగాల జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కక్షిదారులు లోక్ అదాలత్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. సెప్టెంబర్ 12న నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్లో రాజీమార్గం ద్వారా మొత్తం 5,552 కేసులను పరిష్కరించి, నారాయణపేట జిల్లా రాష్ట్రవ్యాప్తంగా 23వ ర్యాంకు సాధించిందని తెలిపారు. ఈ విజయానికి కృషి చేసిన న్యాయమూర్తులు, పోలీసు అధికారులు మరియు



సంబంధిత సిబ్బందిని అభినందించారు. డిసెంబర్ 12న జరిగే జాతీయ లోక్ అదాలత్ లో క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, సివిల్ కేసులు,నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్స్ (ఎన్ఐ) యాక్ట్ కేసులు, ఎగ్జిక్యూషన్ పిటిషన్స్ (ఈపీ) కేసులు, సైబర్ నేరాల కేసులు, నాన్-బెయిలబుల్ వారెంట్ ఖైదీలకు సంబంధించిన కేసుల పరిష్కారానికి (ఎన్బీడబ్ల్యూ) కేసులను అధిక సంఖ్యలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు.అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల పరిష్కార ప్రక్రియను యథావిధిగా కొనసాగించాలని తెలిపారు.వుమన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్, సఖి కేంద్రాల సిబ్బందితో మాట్లాడుతూ పోక్సో కేసుల్లో తప్ప నిసరి నివేదికలు, బాధితుల గుర్తింపు రక్షణ, ఫాస్ట్ ట్రయల్స్ తదితర అంశాలను అడిగి తెలుసు కున్నారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.ఈ సమావేశంలో కలెక్టర్ అండ్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ ప్రియాంక, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డాక్టర్ జి.వినీత్ కుమార్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కం సీనియర్ సివిల్ న్యాయమూర్తి వింధ్యానాయక్, డీఎస్పీ లింగయ్య, రెవిన్యూ డివిషనల్ ఆఫీసర్ రమేష్, డిస్ట్రిక్ట్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎం.ఏ.రషీద్, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కరిష్మా, వన్ స్టాప్ సఖి సెంటర్ కోఆర్డినేటర్ క్రాంతి రేఖ,వుమన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అనిత మరియు పోలీస్ సిబ్బంది ఇతర అధికారులు పాల్గొన్నారు.





ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమం

చిలుకూరు, మన ప్రజాపక్షం:
ఆచార్యుల గూడెంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు, స్థానిక ప్రజలకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజలు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నదానం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో ఐక్యత, భక్తిభావం పెంపొందుతుందని తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.



కనీస వసతులు లేని వైకుంఠధామం

చిలుకూరు, మన ప్రజాపక్షం
:మండలంలోని దూదియా తండా గ్రామంలోని శ్మశాన వాటిక సరైన నిర్వహణ లేక నిరుపయోగంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంత్యక్రియలు నిర్వహించే సమయంలో మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. స్మశాన వాటికలకు వెళ్లేందుకు సరైన దారి లేకపోవడంతో వర్షాకాలంలో బురదలోనే శవాలను మూసుకెళ్లాల్సి వస్తుందని, అలాగే చుట్టూ రక్షణ గోడ లేకపోవడం వల్ల పశువులు వెళ్తున్నాయని అలాగే ఆకతాయిలు మద్యం సేవించి సీసాలు పడేస్తున్నారని, శ్మశానవాటికలో అవసరమైన సౌకర్యాలు కల్పించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని గ్రామస్థులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



బిజినపల్లి పోలీసు స్టేషన్ లో ఘనంగా వినాయకుని నిమజ్జన వేడుకలు

ప్రత్యేక పూజలు నిర్వహించిన డీఎస్పీ బుర్రి శ్రీనివాస్ యాదవ్

బిజినపల్లి,మన ప్రజాపక్షం :
బిజినపల్లి పోలీస్ స్టేషన్ లో వినాయక చవితి నిమజ్జన వేడుకలను పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహానికి నాగర్ కర్నూల్ డీఎస్పీ బుర్రి శ్రీనివాస్ యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలకు నాగర్ కర్నూల్ సీఐ అశోక్ రెడ్డి, బిజినపల్లి ఎస్ఐ షంషుద్దీన్,తాడూరు ఎస్సై రాములు, తిమ్మాజిపేట ఎస్ఐ శ్రీనివాసరావు హాజరయ్యారు.అనంతరం డీఎస్పీ బుర్రి శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. గ్రామాల్లో కల్మషం లేని వాతావరణాన్ని అలవర్చుకోవాలని,వినాయక నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో జాగ్రత్తగా నిర్వహించుకోవాలని సూచించారు.పూజల అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించిన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ నుండి వినాయకుడిని ఊరేగింపుగా తీసుకవెళ్లి నిమజ్జన వేడుకలు పూర్తి చేశారు.ఈ వేడుకలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మిద్దె రాములు, మాజీ సర్పంచ్ గంగానమోని తిరుపతయ్య, పోలీస్ సిబ్బంది, విలేకరులు, ప్రజలు పాల్గొన్నారు.




విద్యార్థి ఆత్మహత్యకు కారణమైన ఉపాధ్యాయులను సస్పెండ్ చేయమని ప్రశ్నిస్తే అరెస్ట్ చేస్తారా?

నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం:
నాగర్ కర్నూల్ మహాత్మా జ్యోతిబాపూలే కళాశాల ఉపాధ్యాయుల వేధింపులకు భరత్ అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకుని మరణించాడు. ఆలస్యంగా విషయం బయటికి రావడంతో టిఆర్ఎస్వి విద్యార్థి సంఘం భరత్ ని వేధింపులతో ఆత్మహత్యకు కారణమైన ఉపాధ్యాయులను ప్రభాకర్ రెడ్డిని,శంకర్ సస్పెండ్ చేయాలని నాగర్కర్నూల్ జిల్లా కేంద్రంలో నిన్న ధర్నా నిర్వహించారు. వేదిక దగ్గరికి వచ్చిన పై అధికారులకు వినతి పత్రం అందజేశారు,ఈ సందర్భంగా నాగర్ కర్నూలు జిల్లా బిఆర్ఎస్వి నాయకుడు అతినారపు విష్ణువర్ధన్ మాట్లాడుతూ రేపు ఉదయం 10 గంటలకు కల్ల వేధింపు గురిచేసిన ఉపాధ్యాయులు సస్పెండ్ చేయకపోతే,పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. భరత్ అనే విద్యార్థి మరణం పట్ల నిరసనగా నాగర్ కర్నూల్ పట్టణంలో కాలేజ్ బంద్ ని నిర్వహిస్తామని తెలియజేశారు. నేడు శ్రీపురం మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల కళాశాల దగ్గరికి బిఆర్ఎస్వి నాయకులు వెళ్ళగా, అక్కడున్న పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి, తెలకపల్లి పోలీస్ స్టేషన్ కి తరలించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్వి నాయకులు మాట్లాడుతూ ఈ అక్రమ అరెస్టులతో మా గొంతుకను ఆపలేరని, భరత్ కుటుంబానికి న్యాయం చేసేంతవరకు నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జన వేడుకలు నిర్వహించాలి

చెరువులు, కుంటల వద్దకు వృద్ధులు, చిన్న పిల్లలు వెళ్లరాదు
డీజేలకు అనుమతి లేదు: ఎస్ఐ శంషుద్దీన్



బిజినపల్లి, మన ప్రజాపక్షం: వినాయక నిమజ్జన వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని బిజినపల్లి ఎస్ఐ శంషుద్దీన్ కోరారు. చెరువులు, కుంటల వద్దకు వృద్ధులు, చిన్న పిల్లలు వెళ్లరాదని, అలాగే డీజేల వద్దకు కూడా వెళ్లరాదని హెచ్చరించారు. నిమజ్జన వేడుకల్లో ఎవరైనా డీజేలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. డీజేల శబ్దాల వల్ల చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మండప నిర్వాహకులు గణనాథుని నిమజ్జనం చేసే క్రమంలో మద్యపానానికి దూరంగా ఉండాలని, ఊరేగింపు సమయంలో విద్యుత్ శాఖ వారితో సమన్వయం పాటించి కరెంటు వైర్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి వేడుకలను సురక్షితంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

నిరుపేద కుటుంబం నుంచి జాతీయ స్థాయి అథ్లెట్‌గా కొడవత్ స్వప్న - స్వర్ణ పతకం కైవసం



తిమ్మాజిపేట, మన ప్రజాపక్షం: పేదరికాన్ని జయించి పట్టుదలతో జాతీయ స్థాయిలో సత్తా చాటింది నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం పుల్లగిరి గ్రామపంచాయతీ పరిధిలోని కొడవత్ తండాకు చెందిన కొడవత్ స్వప్న అథ్లెటిక్స్‌లో అద్భుత ప్రతిభ కనబరిచింది. పుదుచ్చేరిలో జరిగిన జాతీయ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో అండర్-20 బాలికల 3 వేల మీటర్ల స్టీపుల్‌చేస్ విభాగంలో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. నిరుపేద కుటుంబం నుంచి వచ్చి,ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూనే క్రీడల్లో రాణిస్తూ జాతీయ స్థాయి అథ్లెట్‌గా ఎదిగిన స్వప్న ప్రస్థానం ఎంతో మందికి స్ఫూర్తిదాయకం. స్వప్న విజయంతో కొడవత్ తండాలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. స్థానికులు, క్రీడాభిమానులు ఆమెను అభినందిస్తున్నారు.



ఎద్దుల బండిపై ఊరేగింపుగా వినాయకుని నిమర్జనం వేడుకలు

శ్రీకృష్ణ యూత్ సభ్యులను అభినందించిన గ్రామ ప్రజలు

బిజినపల్లి,మన ప్రజాపక్షం :
బిజినపల్లి గ్రామంలోని సంతోష్ నగర్ కాలనీలో శ్రీకృష్ణ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయకుని నిమజ్జన వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యూత్ సభ్యులు వినాయక విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన ఎద్దుల బండిపై ఉంచి, డోలు చప్పుళ్లతో, భజనలతో ఊరేగింపుగా తీసుకెళ్లి ఘనంగా నిమజ్జనం వేడుకలు నిర్వహించారు. భక్తులు బొడ్డెమ్మలు, కోలాటాలతో సందడి చేశారు. విజన్ ఆంధ్ర రిపోర్టర్ శ్రీకృష్ణ యూత్ కమిటీ సభ్యులు పలకరించగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా పురాతన పద్ధతిలోనే నిమజ్జన వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ వేడుకలకు గ్రామ ప్రజల నుంచి మంచి స్పందన రావడం ఎంతో సంతోషం కలిగించిందని అన్నారు. ప్రస్తుత వాతావరణంలో డీజే శబ్దాల వల్ల ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎద్దుల బండి, డోలు వాయిద్యాలు, అడుగుల భజనలతో శాంతియుతంగా వేడుకలు నిర్వహిస్తున్నామని అన్నారు. మరుగునపడుతున్న మన పురాతన పద్ధతులను ప్రస్తుత సమాజానికి పరిచయం చేయాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టామని, గ్రామ ప్రజల నుంచి మంచి స్పందన రావడం ఎంతో సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు.



రాయలగండి తండాలో ఘనంగా వినాయక నిమజ్జనం

పదర,మన ప్రజాపక్షం
మండలంలోని రాయలగండి తండాలో వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం గణనాథుడి నిమజ్జన కార్యక్రమాన్ని వినాయక ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శ్రీకాంత్ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తండా వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో గణనాథుడికి వీడ్కోలు పలికారు.నిమజ్జనాన్ని పురస్కరించుకుని గిరిజనులు సంప్రదాయ దుస్తులు ధరించి ఆటపాటలు, కోలాటాలతో ఉత్సాహంగా ఊరేగింపు నిర్వహించారు. డప్పుల మోతలు, కోలాటాలు, నృత్యాలతో తండలో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు, యువత, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని గణపతి బప్పా మోరియా అంటూ నినాదాలు చేశారు.అనంతరం గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. తండా ప్రజలు సుఖశాంతులతో పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని గణనాథుడిని ప్రార్థించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తండా పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు, యువత, మహిళలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



అస్వస్థతకు గురైన విద్యార్థినులను పరామర్శించిన ఆర్డీఓ

ధన్వాడ, మన ప్రజాపక్షం
ధన్వాడ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్/కాలేజ్ బాలికల హాస్టల్‌లో శనివారం ఉదయం కలుషిత అల్పాహారం తీసుకున్న పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురై జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఆర్డీవో రమేష్ ఆసుపత్రిని సందర్శించి విద్యార్థినులను పరామర్శించారు.ప్రతి విద్యార్థిని వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఆర్డీవో, మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఘటనపై సమగ్ర విచారణ చేపట్టినట్లు ఆర్డీవో తెలిపారు. విచారణ అనంతరం బాధ్యులైన వంట ఏజెన్సీని, కేర్‌టేకర్/వార్డెన్ ను తొలగించినట్లు వెల్లడించారు.కాగా విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా, మెరుగ్గా ఉందని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్ కుమార్ తెలిపారు.





మెగా జాబ్ మేళాలో యువతకు ఉద్యోగ ఆఫర్ లెటర్లు అందజేసిన ఉత్తమ్ పద్మావతి రెడ్డి, రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి


కోదాడ, మన ప్రజాపక్షం :
కోదాడ పట్టణంలోని సెయింట్ జోసెఫ్ సీసీఆర్ విద్యానిలయంలో యువతకు విస్తృతమైన ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన యువతీ యువకులకు కోదాడ శాసనసభ్యురాలు ఉత్తమ్ పద్మావతి రెడ్డి, ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి జాబ్ ఆఫర్ లెటర్లు అందజేశారు.వివిధ ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఆఫర్ లెటర్లు అందజేస్తూ, వారిని అభినందించారు. యువత తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని వారు ఆకాంక్షించారు.నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను ఒకే వేదికపై అందించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ మెగా జాబ్ మేళా యువతలో కొత్త ఆశలు, ఆత్మవిశ్వాసాన్ని నింపింది.



వైద్యం వికటించి మహిళ మృతి - సంధ్య ప్రసూతి ఆస్పత్రి వైద్యుల పరార్

జనగామ, మన ప్రజాపక్షం:
జనగామ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న సంధ్య ప్రసూతి ఆసుపత్రిలో వైద్యం వికటించి ఒక మహిళ మృతి చెందిన ఘటన తీవ్ర కలకలం రేపింది.రఘునాథపల్లి మండలం నక్కపోతుల తండాకు చెందిన మంజుల (భర్త శ్రీనివాస్) అనే మహిళ ఈ నెల 8వ తేదీన గర్భసంచి ఆపరేషన్ నిమిత్తం ఈ ఆస్పత్రిలో చేరారు. వైద్యులు ఆపరేషన్ నిర్వహించిన అనంతరం, కేవలం ఐదు రోజులకే ఆమెను డిశ్చార్జ్ చేసి ఇంటికి పంపించారని కుటుంబ సభ్యులు తెలిపారు.?ఇంటికి వెళ్లిన తర్వాత మంజుల ఆరోగ్యం క్షీణించడంతో శుక్రవారం తిరిగి సంధ్య ప్రసూతి ఆసుపత్రికి తీసుకువచ్చారు. బాధితురాలి పరిస్థితి విషమంగా ఉందని తెలిపిన ఆస్పత్రి నిర్వాహకులు, తమ సొంత అంబులెన్స్‌లోనే ఆమెను హైదరాబాద్‌లోని స్కార్ ఆసుపత్రికి తరలించారు. అయితే మార్గమధ్యలోనే లేదా అక్కడ పరిశీలించిన అనంతరం మంజుల మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ?మహిళ మృతి చెందిన విషయం తెలియగానే సంధ్య ప్రసూతి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ఆస్పత్రి గదులకు తాళాలు వేసి అక్కడి నుండి పరారయ్యారని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మృతురాలికి ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారని, వైద్యుల నిర్లక్ష్యం వల్లే తమ మనిషి ప్రాణాలు కోల్పోయిందని కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులపై కఠిన చర్యలు తీసుకుని తమ కుటుంబానికి న్యాయం చేయాలని స్థానిక పోలీసులను, వైద్యాధికారులను డిమాండ్ చేస్తున్నారు.

జనగామ పట్టణంలోని పలు ప్రాంతాల్లో మలాథియాన్ ఆయిల్ స్ప్రేయింగ్



జనగామ, మన ప్రజాపక్షం: జనగామ పురపాలక సంఘం పరిధిలో దోమల నివారణ మరియు ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో మలాథియాన్ ఆయిల్ స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు.పట్టణంలోని నివాస ప్రాంతాలు, మురుగు కాలువలు, నీరు నిలిచే ప్రదేశాలు, దోమల ఉత్పత్తికి అనుకూలమైన ప్రాంతాలను గుర్తించి ఆయిల్ స్ప్రేయింగ్ చేపట్టారు. దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను నియంత్రించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని చైర్పర్సన్ మరియు కమిషనర్ తెలిపారు.ఈ సందర్భంగా చైర్పర్సన్ మరియు కమిషనర్ లు మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పురపాలక సిబ్బంది చేపడుతున్న పారిశుద్ధ్య, దోమల నియంత్రణ కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు.పట్టణంలోని అవసరమైన ప్రాంతాల్లో దశలవారీగా మలాథియాన్ ఆయిల్ స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు తెలిపారు.





కలుషిత ఆహార ఘటనపై కలెక్టర్ తక్షణ చర్యలు

విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది

జిల్లా కలెక్టర్ ప్రియాంక

నారాయణపేట, మన ప్రజాపక్షం

:నారాయణ పేట జిల్లాలోని ధన్వాడ మోడల్ స్కూల్/ కాలేజ్ బాలికల హాస్టల్ లో శనివారం ఉదయం చోటుచేసుకున్న కలుషిత అల్పాహారం తిని పలువురు విద్యార్థినులు అస్వస్థత కు గురైన ఘటనపై జిల్లా కలెక్టర్ ప్రియాంక తక్షణం స్పందించారు. ఘటనపై పూర్తి వివరాలను సేకరించి, సమగ్ర విచారణ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆర్డీవో రమేష్, తహసీల్దార్ సింధూజ, మండల ప్రత్యేక అధికారి సాల్మన్ సంఘటన స్థలానికి చేరుకుని విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని సమీక్షించారు.అత్యవసర వైద్య సహాయం అవసరమైన విద్యార్థినులను ప్రభుత్వ జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని కలెక్టర్ తెలిపారు.ఘటనకు గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉందని, విచారణ అనంతరం బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రాథమికంగా పాఠశాల వంట ఏజెన్సీ ని రద్దు చేయడంతో పాటు కేర్ టేకర్/ వార్డెన్ ను తొలగించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.విద్యార్థుల ఆరోగ్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.



పండుగ రద్దీకి రైల్వే ఏర్పాట్లు.. ఏపీ, తెలంగాణ మధ్య ప్రత్యేక రైళ్లు

దసరా పండుగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. రద్దీని నివారించేందుకు చర్లపల్లి – శ్రీకాకుళం మధ్య 16 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ రైళ్లను అక్టోబర్, నవంబర్ నెలల్లో అందుబాటులోకి తీసుకురానున్నారు. షెడ్యూల్ వివరాల ప్రకారం.. రైలు నంబర్ 07037 (చర్లపల్లి – శ్రీకాకుళం) అక్టోబర్ 6, 13, 20, 27 తేదీలతో పాటు నవంబర్ 3, 10, 17, 24 తేదీల్లో నడవనుంది. తిరుగు ప్రయాణంలో రైలు నంబర్ 07038 (శ్రీకాకుళం – చర్లపల్లి) అక్టోబర్ 7, 14, 21, 28 మరియు నవంబర్ 4, 11, 18, 25 తేదీల్లో ప్రయాణికులకు అందుబాటులో ఉంటుంది.ఈ ప్రత్యేక రైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, సింహాచలం, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి స్టేషన్లలో ఆగుతాయి.వీటితో పాటు చర్లపల్లి – నాగర్‌కోయిల్ మార్గంలోనూ 10 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైలు నంబర్ 07535 సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 23 వరకు ప్రతి శుక్రవారం, రైలు నంబర్ 07536 సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 25 వరకు ప్రతి ఆదివారం నడవనున్నాయి. పండుగ సీజన్‌లో సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులు ఈ ప్రత్యేక సర్వీసులను వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.



విద్యతోపాటు వ్యక్తిత్వ వికాసం, మానవీయ విలువలు పెంపొందించాలి

విద్యార్థుల్లో భాషా నైపుణ్యాల పెంపునకు ఉపాధ్యాయుల పాత్ర అమూల్యం

విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర

ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి

నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం

:ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యాబోధనతోపాటు వ్యక్తిత్వ వికాసం, మానవీయ విలువలను పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని నాగర్ కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని ఎమ్మెల్యే అన్నారు. శనివారం నాగర్ కర్నూల్ పట్టణంలోని వెలుమ ఫంక్షన్ హాల్‌లో రికగ్నైజ్డ్ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ రాష్ట్రం ఆధ్వర్యంలో నిర్వహించిన హిందీ దినోత్సవ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హిందీ ఉపాధ్యాయులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలను పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు.భాషల పరిరక్షణతోనే సంస్కృతి, సంప్రదాయాలు భావితరాలకు అందుతాయని, ఈ దిశగా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో కృషి చేయాలని సూచించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించడంతోపాటు వారిలో మంచి ఆలోచనా విధానం, క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతను పెంపొందించేలా ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని అన్నారు.విద్యార్థుల్లో హిందీ భాషపై ఆసక్తి, అభిరుచి పెంపొందించేలా బోధనా పద్ధతులను మరింత సరళంగా, ఆకర్షణీయంగా రూపొందించాలని ఎమ్మెల్యే సూచించారు. కేవలం మార్కుల సాధనకే విద్య పరిమితం కాకుండా, మంచి విలువలు, బాధ్యతాయుతమైన ఆలోచన, సామాజిక స్పృహ కలిగిన





పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడమే విద్య యొక్క ప్రధాన లక్ష్యమని,ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే తెలిపారు. ఉపాధ్యాయులు ప్రభుత్వానికి కొంత సమయం, సహకారం అందించాలని కోరారు.హిందీ భాష అభివృద్ధికి, విద్యార్థుల్లో భాషా నైపుణ్యాల పెంపునకు కృషి చేస్తున్న హిందీ ఉపాధ్యాయులను ఎమ్మెల్యే అభినందించారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు తమ పాత్రను మరింత బాధ్యతగా నిర్వర్తించాలని ఆకాంక్షించారు.జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రమేష్ కుమార్ మాట్లాడుతూ హిందీ భాష ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించడంతోపాటు దేశంలోని వివిధ భాషలు, సంస్కృతుల పట్ల గౌరవ భావనను పెంపొందించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు.జిల్లాలో పదో తరగతి ఫలితాల్లో హిందీ సబ్జెక్టులో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేసిన హిందీ ఉపాధ్యాయులను డీఈఓ ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడంతోపాటు వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని అన్నారు.రూప్ జిల్లా అధ్యక్షులు విజయ్ కుమార్ మాట్లాడుతూ హిందీ భాష అభివృద్ధితోపాటు విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలను పెంపొందించేందుకు హిందీ ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించి కృషి చేయాలని అన్నారు. భాషా పండితులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ చర్యలు తీసుకోవాలని కోరారు.హిందీ సబ్జెక్టులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన హిందీ ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఎమ్మెల్యే, డీఈఓ చేతుల మీదుగా సన్మానించి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఉపాధ్యాయుల సేవలను అభినందిస్తూ వారి కృషి విద్యార్థుల భవిష్యత్ నిర్మాణానికి దోహదపడుతుందని వారు పేర్కొన్నారు.విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, రికగ్నైజ్డ్ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షులు విజయ్ కుమార్, హమ్ హరూన్,ఎండి బురహన్, షాకిర్ పాషా, జహంగీర్, నాగేశ్వర్‌రావు, రూప్ల నాయక్, సాజిద్, శ్రీనివాసులు, వెంకట రాజు, బసవయ్య, కురుమూర్తి, రాజు నాయక్,హిందీ



ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కొండారెడ్డిపల్లి చెరువు వద్ద గణేష్ నిమజ్జన భద్రతా ఏర్పాట్ల పరిశీలన

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలి

కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ డాక్టర్ వినీత్

నారాయణపేట, మన ప్రజాపక్షం

:నారాయణపేట జిల్లా కేంద్రంలోని కొండారెడ్డిపల్లి చెరువు వద్ద గణేష్ నిమజ్జనం సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ప్రియాంక, జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.గణేష్ నిమజ్జనానికి పెద్ద సంఖ్యలో భక్తులు, విగ్రహాల నిర్వాహకులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని కలెక్టర్, ఎస్పీ అధికారులను ఆదేశించారు. కొండారెడ్డిపల్లి చెరువులో ప్రస్తుతం నీటిమట్టం తక్కువగా ఉన్నందున నిమజ్జనం సమయంలో భక్తులు ప్రమాదవశాత్తు చెరువులోకి వెళ్లకుండా చెరువు అంచు వరకు అవసరమైన బారికేడింగ్, రక్షణ ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించేలా గజ ఈతగాళ్లు, క్రేన్లు, బోట్లు/పుట్టీలు, ఇతర రక్షణ పరికరాలు అందుబాటులో ఉంచాలని తెలిపారు.చెరువులోకి ఎవరూ వెళ్లకుండా పోలీసు



సిబ్బందితో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, ప్రమాదకర ప్రాంతాలను ముందుగానే గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. రాత్రి వేళల్లో కూడా నిమజ్జనం జరిగే అవకాశం ఉన్నందున చెరువు పరిసరాల్లో తగినంత విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.నిమజ్జనానికి వచ్చే వాహనాలు, భక్తుల రద్దీతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తుగా పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. నిమజ్జన ప్రాంతంలో ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను క్రమబద్ధీకరించి, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాలు, ఇతర అత్యవసర సేవల వాహనాలు సులభంగా చేరుకునేలా మార్గాలను అందుబాటులో ఉంచాలని తెలిపారు.కొండారెడ్డిపల్లి చెరువులో నీటిమట్టం తక్కువగా ఉన్నందున 15 అడుగులకు పైగా ఎత్తు కలిగిన గణేష్ విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేయకుండా కృష్ణా నది లేదా అధికారులు గుర్తించిన ప్రత్యామ్నాయ నిమజ్జన ప్రాంతాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్, ఎస్పీ సూచించారు. అలాంటి విగ్రహాలను తరలించే సమయంలో నిర్వాహకులకు ఇబ్బందులు కలగకుండా రూట్, ట్రాఫిక్, పోలీసు బందోబస్తు, రవాణా తదితర ఏర్పాట్లను ముందుగానే సిద్ధం చేయాలని ఆదేశించారు.నిమజ్జన ప్రాంతంలో భక్తులకు తాగునీరు, పారిశుద్ధ్య, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని, పారిశుద్ధ్య సిబ్బంది నిరంతరం పనిచేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు.గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, వైద్య, అగ్నిమాపక, నీటిపారుదల తదితర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్, ఎస్పీ సూచించారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా ముందస్తు ప్రణాళికతో పనిచేసి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా పూర్తి చేయాలని తెలిపారు.ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులు నిమజ్జన ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను కలెక్టర్, ఎస్పీకి వివరించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమేశ్, డీఎస్పీలు మహేష్, నల్లపు లింగయ్య, సీఐ శివశంకర్, మున్సిపల్ కమిషనర్ శంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు,పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రొమ్ము క్యాన్సర్ చికిత్సకు కొత్త ఔషధం..

3వ దఫా ట్రయల్‌లో విఫలం..

అధునాతన రొమ్ము క్యాన్సర్ చికిత్సలో కొత్త ఆశలు రేకెత్తించిన క్యాన్సర్ ఔషధానికి కీలకమైన క్లినికల్ ట్రయల్‌లో ఆశించిన ఫలితాలు దక్కలేదు. ఆస్ట్రాజెనెకా అభివృద్ధి చేసిన క్యామిజెస్ట్రాంట్‌ను అధునాతన హార్మోన్ రిసెప్టర్ పాజిటివ్, హెచ్‌ఈఆర్2 నెగెటివ్ రొమ్ము క్యాన్సర్ చికిత్సలో పరిశీలించారు. సెరెనా-4 పేరుతో నిర్వహించిన మూడో దశ క్లినికల్ ట్రయల్‌లో 1,371 మంది ఇంతకుముందు చికిత్స పొందని రోగులు పాల్గొన్నారు. క్యామిజెస్ట్రాంట్‌ను ఇబ్రాన్స్ అనే ఔషధంతో కలిపి ఇచ్చిన చికిత్సను, ఇబ్రాన్స్‌తో పాటు సాధారణ హార్మోన్ తగ్గించే చికిత్సతో పోల్చారు. క్యాన్సర్ ముదిరే వరకు రోగులు వ్యాధి నియంత్రణలో ఉన్న కాలాన్ని ప్రధానంగా పరిశీలించారు.

అదనపు ప్రయోజనం లేదు..

క్యామిజెస్ట్రాంట్ కలయికతో చికిత్స పొందిన రోగుల్లో క్యాన్సర్ ముదిరే వరకు ఉన్న కాలంలో సంఖ్యాపరంగా కొంత మెరుగుదల కనిపించింది. అయితే ఈ తేడా గణాంకపరంగా ముఖ్యమైన స్థాయికి చేరుకోలేదు. అంటే ఈ చికిత్స వల్ల ప్రామాణిక చికిత్సతో పోలిస్తే స్పష్టమైన అదనపు ప్రయోజనం ఉందని ఈ అధ్యయనం నిర్ధారించలేకపోయింది. ట్రయల్‌కు సంబంధించిన పూర్తి వివరాలను భవిష్యత్తులో జరిగే వైద్య సమావేశంలో వెల్లడించనున్నట్లు ఔషధ సంస్థ తెలిపింది. ఈ ఫలితం నిర్దిష్ట చికిత్సా పరిస్థితిలో క్యామిజెస్ట్రాంట్ ప్రభావంపై మరింత పరిశోధన అవసరాన్ని సూచిస్తోంది.

పరిశీలిస్తున్న నిపుణులు..

క్యామిజెస్ట్రాంట్ అనేది ఈస్ట్రోజెన్ రిసెప్టర్ కార్యకలాపాలను లక్ష్యంగా చేసుకునే ఔషధం. ఇది సెలెక్టివ్ ఈస్ట్రోజెన్ రిసెప్టర్ డీగ్రేడర్ అనే ఔషధాల



తరగతికి చెందుతుంది. హార్మోన్ రిసెప్టర్ పాజిటివ్ రొమ్ము క్యాన్సర్‌లో ఈస్ట్రోజెన్ వంటి హార్మోన్లు క్యాన్సర్ కణాల పెరుగుదలకు సహకరిస్తాయి. ఈస్ట్రోజెన్ రిసెప్టర్‌ను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా క్యాన్సర్ పెరుగుదలను నెమ్మదించడం లేదా అడ్డుకోవడం ఈ ఔషధం ఉద్దేశం. ముఖ్యంగా ఈఎస్ఆర్1 జన్యు మార్పులు ఏర్పడిన కొన్ని రొమ్ము క్యాన్సర్లలో హార్మోన్ ఆధారిత చికిత్సలకు నిరోధకత పెరుగుతుందని భావిస్తున్న నేపథ్యంలో ఈ ఔషధాన్ని పరిశీలిస్తున్నారు.

విఫలమైన ఔషధం..

అయితే ఈ ట్రయల్‌లో ఆశించిన ఫలితం రాకపోయినప్పటికీ క్యామిజెస్ట్రాంట్‌పై పరిశోధనలు పూర్తిగా నిలిచిపోలేదు. ఇతర రకాల రొమ్ము క్యాన్సర్ చికిత్సా పరిస్థితుల్లో, ముఖ్యంగా వ్యాధి ప్రారంభ దశల్లోనూ ఈ ఔషధాన్ని పరిశీలిస్తున్నారు. ఇటీవల ఇదే తరహాలో మరో ఔషధ కలయిక కూడా అధునాతన దశలో క్యాన్సర్ ముదిరే సమయాన్ని గణనీయంగా ఆలస్యం చేయడంలో విఫలమైంది. హార్మోన్ రిసెప్టర్ పాజిటివ్, హెచ్‌ఈఆర్2 నెగెటివ్ రొమ్ము క్యాన్సర్‌కు లక్ష్యిత చికిత్సల్లో పురోగతి సాధిస్తున్నప్పటికీ, ప్రతి చికిత్సా విధానం అన్ని రోగులలో ఒకే విధమైన ప్రయోజనాన్ని అందించదని ఈ ఫలితాలు సూచిస్తున్నాయి.

పిల్లల్లో నిద్ర సమస్యలు ఎందుకు వస్తాయి..

ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయి..?



పిల్లల్లో నిద్ర సమస్యలు కేవలం ఎక్కువగా తెరలను చూడడం లేదా సమయానికి నిద్రించడానికి ఇష్టపడకపోవడం వల్లే వస్తాయని భావించకూడదు. శరీరంలోని జీవ గడియారం, నిద్ర అవసరం, వెలుతురు ప్రభావం, భావోద్వేగ ఉద్రిక్తత, రోజువారీ అలవాట్లలో స్థిరత్వం వంటి అనేక అంశాలు పిల్లల నిద్రను ప్రభావితం చేస్తాయి. వీటిలో పదేపదే మార్పులు చోటుచేసుకుంటే పిల్లలకు నిద్ర పట్టడం, నిద్రలో కొనసాగడం లేదా ఉదయం ఉత్సాహంగా మేల్కొనడం కష్టమవుతుంది. ముఖ్యంగా రాత్రి వేళ ప్రకాశవంతమైన వెలుతురు శరీరంలో నిద్రకు సంకేతమిచ్చే మెలటోనిన్ హార్మోన్ విడుదలను తగ్గిస్తుంది. ఆటలు ఆడడం, చిన్న వీడియోలు చూడడం వంటి ఉత్తేజపరిచే కార్యక్రమాలు నిద్రకు ముందు మెదడును మరింత చురుకుగా ఉంచుతాయి. అందువల్ల నిద్రకు ముందు చివరి గంటలో ఇలాంటి పరికరాలకు దూరంగా ఉంచడం మంచిది.

ఆలస్యంగా నిద్రిస్తే..

వారాంతాల్లో ఆలస్యంగా నిద్రపోవడం, ఆలస్యంగా మేల్కొనడం కూడా పిల్లల నిద్ర చక్రాన్ని ప్రభావితం చేస్తుంది. వారంలో నిద్రించే సమయానికి, వారాంతపు నిద్ర సమయానికి మధ్య ఎక్కువ తేడా ఉంటే సోషల్ జెట్ లాగ్ వంటి పరిస్థితి ఏర్పడుతుంది. శనివారం, ఆదివారం ఎక్కువసేపు నిద్రించిన తర్వాత సోమవారం సాధారణ సమయానికి నిద్రపోవడం పిల్లలకు కష్టంగా మారుతుంది. అందుకే ప్రతిరోజూ దాదాపు ఒకే సమయానికి మేల్కొనేలా చేయడం ఉపయోగకరంగా ఉంటుంది. ఉదయం సహజమైన సూర్యకాంతిలో కొంతసేపు గడపడం శరీర జీవ గడియారాన్ని క్రమబద్ధీకరించడంలో సహాయపడుతుంది. అలాగే భోజనం, ఆటలు, విశ్రాంతి, నిద్ర సమయాలను సాధ్యమైనంత వరకు ఒకే విధంగా కొనసాగించడం కూడా ముఖ్యం.

నిద్రించే సమయంలో ఇలా చేస్తే..

నిద్రించే సమయంలో పిల్లలు నీళ్లు కావాలి, మరో కథ చెప్పాలి, తినడానికి ఏదైనా కావాలి అంటూ పదేపదే సమయం తీసుకోవడం సాధారణంగా కనిపిస్తుంది. అయితే ఇలా నిద్రను ఆలస్యం చేయడం అలవాటుగా మారితే సమస్య మరింత పెరుగుతుంది. స్నానం, దంతాలను తోముకోవడం, కథ చదవడం, దీపాలు ఆర్పడం వంటి పనులను ప్రతిరోజూ దాదాపు ఒకే క్రమంలో చేయడం ద్వారా నిద్ర సమయం వచ్చిందనే సంకేతం పిల్లల మెదడుకు అందుతుంది. కొంతమంది పిల్లలు తల్లిదండ్రులు పక్కన నిద్రించడం, టీవీ ఆన్‌లో ఉండడం లేదా ఊయల ఊపడం వంటి ప్రత్యేక పరిస్థితులు లేకుండా నిద్రపోలేరు. ఇలాంటి అలవాట్లను ఒక్కసారిగా మార్చడం కంటే క్రమంగా తగ్గించడం సులభంగా ఉంటుంది.

పగటి అలవాట్లు ఎలా ఉన్నాయి..

పిల్లల రాత్రి నిద్రపై పగటి అలవాట్లు కూడా ప్రభావం చూపుతాయి. రోజులో తగినంత శారీరక శ్రమ లేకపోవడం, సహజమైన వెలుతురులో ఎక్కువ సమయం గడపకపోవడం వల్ల సాయంత్రానికి నిద్ర అవసరం తగినంతగా పెరగదు. అందువల్ల పిల్లలకు వయసుకు తగిన శారీరక కార్యకలాపాలు, బయట సహజమైన వెలుతురులో గడిపే సమయం ఉండేలా చూడాలి. మధ్యాహ్నం నిద్రపోయే సమయంపైనా శ్రద్ధ అవసరం. కోలా, ఎనర్జీ డ్రింక్స్, కొన్ని చాక్లెట్లలో ఉండే కెఫీన్ కూడా సున్నితంగా స్పందించే పిల్లల్లో నిద్రకు ఆటంకం కలిగిస్తాయి. అయితే పిల్లల్లో గురక, ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బంది, నోటి ద్వారా శ్వాస తీసుకోవడం, అశాంతిగా నిద్రపోవడం, ఉదయం తలనొప్పి లేదా పగటిపూట అధిక నిద్రమత్తు వంటి లక్షణాలు నిరంతరం కనిపిస్తే వాటిని సాధారణ నిద్ర అలవాట్ల సమస్యగా తీసుకోకూడదు. ఇలాంటి సందర్భాల్లో వైద్యుల సలహా తీసుకోవడం అవసరం.



వైద్యులను అడగకుండా మందులను వాడుతున్నారా.. ఈ కాంబినేషన్లతో జాగ్రత్త..

వయసు పెరిగేకొద్దీ రక్తపోటు, మధుమేహం, కీళ్ల నొప్పులు వంటి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు ఒకేసారి అనేక మందులు వాడాల్సి వస్తుంటుంది. అయితే ఇలా పలు మందులను కలిపి తీసుకునే సమయంలో కొన్ని ఔషధాల మధ్య పరస్పర ప్రభావాలు ఏర్పడి తీవ్రమైన దుష్ప్రభావాలు తలెత్తే అవకాశం ఉంటుంది. వయసు పెరిగే కొద్దీ కాలేయం, మూత్రపిండాల పనితీరు మందగించడం వల్ల శరీరంలోకి చేరిన మందులు బయటకు వెళ్లేందుకు ఎక్కువ సమయం పడుతుంది. దీంతో ఒకప్పుడు సురక్షితంగా ఉన్న మోతాదు కూడా వృద్ధాప్యంలో దుష్ప్రభావాలకు కారణమయ్యే అవకాశం ఉంటుంది. అందువల్ల ప్రతిరోజూ తీసుకునే అన్ని మందులు, సప్లిమెంట్లు, వైద్యుల సూచన లేకుండా వాడే మందుల వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవడం అవసరం.

నొప్పి నివారణ మందులు..

రక్తాన్ని పలుచబరిచే మందులతోపాటు ఇబుప్రోఫెన్, న్యాప్రోక్సెన్ వంటి నొప్పి నివారణ మందులు తీసుకోవడం వల్ల జీర్ణాశయంలో రక్తస్రావం, కడుపులో పుండ్లు ఏర్పడే ప్రమాదం పెరుగుతుంది. అలాగే రక్తపోటు కోసం ఉపయోగించే ఏసీఈ ఇన్హిబిటర్లతోపాటు పొటాషియం సప్లిమెంట్లు లేదా పొటాషియంను నిల్వ చేసే కొన్ని మూత్రవిసర్జక మందులు తీసుకుంటే రక్తంలో పొటాషియం స్థాయిలు ప్రమాదకరంగా పెరిగే అవకాశం ఉంటుంది. ఇది గుండె స్పందనలో అసాధారణ మార్పులకు దారితీస్తుంది. కాబట్టి పొటాషియం సప్లిమెంట్లు లేదా ప్రత్యేక ఉప్పు వంటి వాటిని వైద్యుల సలహా లేకుండా ప్రారంభించకూడదు.

ఆందోళన, నిద్ర ఔషధాలు..

ఆందోళన, నిద్ర కోసం ఉపయోగించే కొన్ని మందులను ఆక్సికోడోన్, ట్రామడాల్ వంటి బలమైన నొప్పి నివారణ మందులతో కలిపి తీసుకోవడం కూడా ప్రమాదకరం. ఈ మందుల ప్రభావం కలిసి మెదడు, నాడీ వ్యవస్థ పనితీరు మరింత మందగించడంతో తీవ్రమైన మగత, గందరగోళం, పడిపోవడం, శ్వాస మందగించడం వంటి సమస్యలు వస్తాయి. మరోవైపు కాల్షియం సప్లిమెంట్లు లేదా కొన్ని అంటాసిడ్లను థైరాయిడ్ మందులతో కలిపి తీసుకుంటే థైరాయిడ్ మందు శరీరంలోకి సరిగా శోషణ అవ్వదు. అందువల్ల ఈ మందుల మధ్య కనీసం నాలుగు గంటల విరామం ఉండేలా చూసుకోవాలి. థైరాయిడ్ మందును సాధారణంగా ఉదయం ఖాళీ కడుపుతో నీటితో తీసుకోవాలని సూచిస్తారు.

కొలెస్ట్రాల్ మందులను వాడితే..

కొలెస్ట్రాల్ తగ్గించే కొన్ని మందులను ఎరిత్రోమైసిన్ వంటి కొన్ని యాంటీబయాటిక్స్ లేదా కెటోకోనజోల్ వంటి యాంటీ ఫంగల్ మందులతో కలిపి తీసుకున్నప్పుడు మందుల స్థాయిలు శరీరంలో అధికంగా పేరుకుపోయే అవకాశం ఉంటుంది. దీంతో తీవ్రమైన కండరాల నష్టం, మూత్రపిండాలపై ఒత్తిడి వంటి సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా వృద్ధుల్లో మందుల ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, ఒక వైద్యుడు సూచించిన మందుతో పాటు ఇతర వైద్యుల మందులు, ఓవర్‌ది కౌంటర్ మందులు, సప్లిమెంట్లు తీసుకుంటున్నట్లయితే వాటి వివరాలను తప్పనిసరిగా తెలియజేయాలి. ఏదైనా అసాధారణ దుష్ప్రభావం కనిపిస్తే స్వయంగా మందు ఆపకుండా వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్సను సమీక్షించుకోవడం ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

ఐబీఎస్ సమస్య ఉన్నవారికి ఎంతో మేలు చేసే సత్తు.. ఎలా ఉపయోగపడుతుందంటే..?

ఇర్రిటబుల్ బవెల్ సిండ్రోమ్ (ఐబీఎస్)తో బాధపడేవారిలో కడుపునొప్పి, ఉబ్బరం, అధిక గ్యాస్, మలబద్ధకం లేదా విరేచనాలు వంటి సమస్యలు తరచూ కనిపిస్తుంటాయి. ఈ సమస్యలను నియంత్రించేందుకు ఆహారంలో కొన్ని మార్పులు చేయడం, ఒత్తిడిని తగ్గించడం, వైద్యుల సూచనలు పాటించడం కీలకం. ఈ నేపథ్యంలో మన దేశంలో చాలాకాలంగా ఉపయోగిస్తున్న సత్తు కూడా జీర్ణవ్యవస్థకు ఉపయోగకరమైన ఆహారంగా నిపుణులు సూచిస్తున్నారు. శనగలను పొడిగా వేయించి తయారు చేసే సత్తులో పీచు, మొక్కల ఆధారిత ప్రొటీన్లు, ఇతర పోషకాలు ఉంటాయి. ముఖ్యంగా మలబద్ధకంతో కూడిన ఐబీఎస్ ఉన్నవారికి తగిన మోతాదులో సత్తు తీసుకోవడం ప్రయోజనకరంగా ఉంటుందని చెబుతున్నారు.

పీచు, రెసిస్టెంట్ స్టార్చ్..

సత్తులో ఉండే కరిగే పీచు, రెసిస్టెంట్ స్టార్చ్ పేగుల పనితీరును మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఇవి పేగుల్లో నీటిని గ్రహించి మలాన్ని సులభంగా బయటకు వెళ్లేలా చేయడంలో తోడ్పడతాయి. రెసిస్టెంట్ స్టార్చ్ పెద్దపేగుకు చేరిన తర్వాత అక్కడి మంచి బ్యాక్టీరియా ద్వారా విచ్ఛిన్నమై ఉపయోగకరమైన షార్ట్ చైన్ ఫ్యాటీ యాసిడ్లుగా మారుతుంది. ఇవి పెద్దపేగు ఆరోగ్యానికి, పేగుల లోపలి పొరను బలోపేతం చేయడానికి సహాయపడతాయి. అయితే ఐబీఎస్ ఉన్న ప్రతి ఒక్కరికీ ఒకే రకమైన ఆహారం సరిపోదు. ముఖ్యంగా సున్నితమైన జీర్ణవ్యవస్థ ఉన్నవారు సత్తును తక్కువ మోతాదుతో ప్రారంభించడం మంచిది.

ఉబ్బరం తగ్గేందుకు..

ఉబ్బరం, కడుపులో గ్యాస్ వంటి సమస్యలను తగ్గించడంలోనూ సత్తు కొంతవరకు సహాయపడుతుంది. పొడిగా వేయించే ప్రక్రియలో పప్పులోని కొన్ని గ్యాస్ కలిగించే పదార్థాలు తగ్గుతాయి. దీంతో సాధారణంగా పప్పుధాన్యాలు తిన్నప్పుడు ఎదురయ్యే అసౌకర్యం కొంత తగ్గే అవకాశం ఉంటుంది. నీటిలో పలుచగా కలిపి తీసుకున్నప్పుడు సత్తు సులభంగా జీర్ణమయ్యే రూపంలో ఉంటుంది. దీనిలో వేయించిన జీలకర్ర పొడి, కొద్దిగా రాక్ సాల్ట్, నిమ్మరసం కలుపుకోవచ్చు. ఇవి జీర్ణక్రియకు తోడ్పడటంతోపాటు భోజనం తర్వాత వచ్చే కడుపు ఉబ్బరాన్ని తగ్గించడంలో సహాయపడతాయి.

ఎలా తీసుకోవాలి..

సత్తును తీసుకునే విధానంపైనా శ్రద్ధ తీసుకోవడం అవసరం. ఒక పెద్ద గ్లాసు గది ఉష్ణోగ్రతలో ఉన్న లేదా గోరువెచ్చని నీటిలో ఒకటి నుంచి రెండు టేబుల్‌స్పూన్ల సత్తును కలిపి పలుచగా తయారు చేసుకుని తాగవచ్చు. ఉదయం మధ్య సమయంలో లేదా మధ్యాహ్నం



సమయంలో తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. రాత్రివేళ తీసుకోవడం మాత్రం నివారించడం మంచిది. విరేచనాలతో కూడిన ఐబీఎస్ లేదా తీవ్రమైన సమస్యలు ఉన్నవారు సత్తును ఒక్కసారిగా ఎక్కువగా తీసుకోకుండా ఒక టీస్పూన్ వంటి తక్కువ మోతాదుతో ప్రారంభించి శరీరం ఎలా స్పందిస్తుందో గమనించాలి. పీచును ఒక్కసారిగా ఎక్కువగా తీసుకుంటే కొందరిలో పేగుల కదలికలు పెరిగే అవకాశం ఉంటుంది. అందువల్ల ఐబీఎస్ ఉన్నవారు తమ లక్షణాలను బట్టి, అవసరమైతే వైద్యుల సలహాతోనే ఆహారంలో సత్తును చేర్చుకోవడం సురక్షితమని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

తక్కువ కేలరీల స్వీటెనర్లతో గుండెకు ప్రమాదమే.. అధ్యయనంలో వెల్లడి..

చక్కెరకు ప్రత్యామ్నాయంగా తక్కువ కేలరీల స్వీటెనర్లను ఉపయోగించడం ఇటీవలి కాలంలో పెరిగింది. వాటిలో జైలిటాల్ కూడా ఒకటి. షుగర్ ఫ్రీ చూయింగ్ గమ్‌లు, క్యాండీలు, ప్రాసెస్డ్ ఆహారాలు, టూత్‌పేస్ట్ వంటి అనేక ఉత్పత్తుల్లో దీనిని విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. అయితే జైలిటాల్ వల్ల గుండె ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం ఉంటుందనే అంశంపై తాజాగా వెలువడిన పరిశోధన ఆసక్తికర విషయాలను వెల్లడించింది. యురోపియన్ సొసైటీ ఆఫ్ కార్డియాలజీ కాంగ్రెస్ 2026లో సమర్పించిన ఈ అధ్యయనంలో రక్తంలో జైలిటాల్ స్థాయిలు ఎక్కువగా ఉన్నవారికి గుండెపోటు, స్ట్రోక్, గుండె సంబంధిత మరణాలు వంటి తీవ్రమైన సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని గుర్తించారు.

అధ్యయనంలో ఏం తేల్చారు..?

ఈ పరిశోధనలో ఉత్తర అమెరికా, యూరప్‌కు చెందిన రెండు పెద్ద అధ్యయనాల నుంచి మొత్తం 17,710 మంది వివరాలను పరిశీలించారు. ఒక అధ్యయనంలో పాల్గొన్నవారిని ఆరు సంవత్సరాల పాటు, మరో అధ్యయనంలో కొందరిని 30 సంవత్సరాల వరకు పరిశీలించారు. వయసు, ధూమపానం, మధుమేహం, అధిక రక్తపోటు వంటి ఇతర గుండె సంబంధిత ప్రమాద కారకాలను కూడా పరిగణనలోకి తీసుకున్నారు. ఆరు సంవత్సరాల పరిశీలనలో రక్తంలో జైలిటాల్ స్థాయిలు అత్యధికంగా ఉన్నవారికి, తక్కువ స్థాయిలు ఉన్నవారితో పోలిస్తే తీవ్రమైన గుండె సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదం 57 శాతం ఎక్కువగా కనిపించింది. దీర్ఘకాలిక అధ్యయనంలో ఈ సంబంధం 18 శాతంగా నమోదైంది. జైలిటాల్ స్థాయిలు పెరిగే కొద్దీ గుండె సంబంధిత ప్రమాదం కూడా పెరుగుతున్నట్లు పరిశోధకులు గుర్తించారు.

ప్లేట్‌లెట్ల కార్యకలాపాలే కారణం..

జైలిటాల్ గుండెపై ప్రభావం చూపడానికి రక్తంలోని ప్లేట్‌లెట్ల కార్యకలాపాలు ఒక కారణం అవుతాయని పరిశోధకులు భావిస్తున్నారు. రక్తస్రావాన్ని ఆపేందుకు ప్లేట్‌లెట్లు రక్తం గడ్డకట్టే ప్రక్రియలో సహాయపడతాయి. అయితే అవి అధికంగా చురుకుగా మారితే అవసరం లేని రక్తం గడ్డలు ఏర్పడే అవకాశం ఉంటుంది. గతంలో నిర్వహించిన ప్రయోగాల్లో జైలిటాల్ తీసుకున్న తర్వాత ప్లేట్‌లెట్ల గడ్డకట్టే సామర్థ్యంలో మార్పులు కనిపించాయి. రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టే ప్రక్రియను ఇది ప్రోత్సహిస్తుందని కొన్ని ప్రయోగశాల పరిశోధనలు కూడా సూచించాయి. గుండెకు రక్తాన్ని తీసుకెళ్లే ధమనిలో రక్తం గడ్డ ఏర్పడి రక్తప్రసరణకు అడ్డంకి కలిగితే గుండెపోటు వస్తుంది. మెదడుకు రక్తప్రసరణకు ఆటంకం ఏర్పడితే ఇస్కీమిక్ స్ట్రోక్ సంభవించే అవకాశం ఉంటుంది.

గుండె పోటు వస్తుందా..

అయితే ఈ పరిశోధన ఆధారంగా జైలిటాల్ తీసుకోవడం వల్ల నేరుగా గుండెపోటు లేదా స్ట్రోక్ వస్తుందని చెప్పలేమని పరిశోధకులు స్పష్టం చేశారు. ఇది పరిశీలనా అధ్యయనం కావడంతో జైలిటాల్ స్థాయిలు, గుండె సంబంధిత సమస్యల మధ్య ఉన్న సంబంధాన్ని మాత్రమే గుర్తించింది. కారణం-ఫలిత సంబంధాన్ని నిర్ధారించలేదు. అందువల్ల జైలిటాల్ ఉన్న ప్రతి ఉత్పత్తిని ప్రమాదకరంగా భావించాల్సిన అవసరం లేదు. ముఖ్యంగా చూయింగ్ గమ్, టూత్‌పేస్ట్ వంటి ఉత్పత్తుల ద్వారా సాధారణంగా జరిగే వినియోగం గుండెపోటు లేదా స్ట్రోక్‌కు కారణమవుతుందని ఈ అధ్యయనం నిరూపించలేదు. అయితే చక్కెరకు ప్రత్యామ్నాయంగా జైలిటాల్‌ను పెద్ద మొత్తంలో, క్రమం తప్పకుండా తీసుకునే విషయంలో మరింత పరిశోధన అవసరమని తాజా ఫలితాలు సూచిస్తున్నాయి.





తనను బాడీ షేమింగ్ చేస్తుండటంపై కత్రినా కైఫ్ స్పందన

ప్రసవానంతరం పెరిగిన బరువుపై సోషల్ మీడియాలో జరుగుతున్న విమర్శలు, బాడీ షేమింగ్ చర్చలపై ప్రముఖ బాలీవుడ్ నటి కత్రినా కైఫ్ స్పందించారు. తన దృష్టిలో నిజమైన అందం అంటే శారీరక, మానసిక ఆరోగ్యంతో ఉండడమేనని స్పష్టం చేశారు. చిత్ర పరిశ్రమలోకి వచ్చిన కొత్తలో కఠినమైన అందాల కొలతలను, నియమాలను అనుసరించినప్పటికీ, అనుభవంతో అందంపై తన దృక్పథం పూర్తిగా మారిపోయిందని తెలిపారు. శారీరక దృఢత్వాన్ని కాపాడుకుంటూ మనసును ప్రశాంతంగా ఉంచుకోవడమే అత్యంత ప్రాధాన్యమైన అంశమని, బయటికి కనిపించే రూపం కంటే వ్యక్తిగత ఆత్మవిశ్వాసమే నిజమైన సౌందర్యమని పేర్కొన్నారు.మరోవైపు కత్రినా కైఫ్‌పై వచ్చిన నిందలు, ట్రోలింగ్‌ను ఖండిస్తూ సినీ ప్రముఖులు వరుసగా మద్దతుగా నిలుస్తున్నారు. తాజాగా నటి, రాజకీయ నాయకురాలు ఖుష్బూ కూడా స్పందిస్తూ... ప్రసవానంతరం మహిళల శరీరంలో అనేక హార్మోన్ల మార్పులు రావడం సహజమైన ప్రక్రియ అని చెప్పారు. మహిళల శారీరక మార్పులను అర్థం చేసుకోకుండా హేళన చేయడం సరికాదని, గతంలో తాను కూడా ఇలాంటి బాడీ షేమింగ్ విమర్శలను ఎన్నోసార్లు ఎదుర్కొన్నానని గుర్తుచేసుకున్నారు. మహిళలు ఇతరుల విమర్శలను పట్టించుకోకుండా తమను తాము ప్రేమించుకోవడమే బాడీ షేమింగ్ చేసేవారికి ఇచ్చే సరైన సమాధానమని స్పష్టం చేశారు.

స్టేట్ లెవెల్ స్కేటింగ్ పోటీలకు లోకేశ్వర్

హైదరాబాద్, సెప్టెంబర్ 19 : రాష్ట్రస్థాయి అండర్ 17 స్కేటింగ్ పోటీలకు హైదరాబాద్ విద్యార్థి చిట్టా లోకేశ్వర్ ఎంపికయ్యాడు. శనివారం సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన హైదరాబాద్ డిస్ట్రిక్ట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో లోకేశ్వర్ మూడు విభాగాల్లో పోటీపడి బంగారు, వెండి, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నాడు.భారతీయ విద్యాభవన్ పబ్లిక్ పాఠశాల (విద్యాశ్రమ్)లో 10వ తరగతి చదువుతున్న లోకేశ్వర్‌ను ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అరుణశ్రీ ప్రత్యేకంగా అభినందించారు.



SPORTS

బహుశా ఇవే నా చివరి ఆసియా క్రీడలు: స్టార్ షట్లర్ ప్రణయ్



ఇంటర్నెట్ డెస్క్: భారత స్టార్ షట్లర్ హెచ్ఎస్ ప్రణయ్ ఆసియా క్రీడలపై కీలక వ్యాఖ్యలు చేశాడు. జపాన్ వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడలు తనకు బహుశా చివరివని చెప్పాడు. అయితే 2028 లాస్‌ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో పాల్గొనే అవకాశాలను మాత్రం ఇప్పుడే వదులుకోలేదని స్పష్టం చేశాడు. మరో ఏడాదిన్నర పాటు తన ఆటను పరిశీలించుకుని.. పోటీపడే స్థాయిలో ఉంటే ఒలింపిక్స్ కోసం ప్రయత్నిస్తానని తెలిపాడు. గత ఆసియా క్రీడల్లో కాంస్య పతకం సాధించిన ప్రణయ్.. ఈసారి 20 మంది సభ్యులతో కూడిన భారత బ్యాడ్మింటన్ జట్టులో చోటు దక్కించుకున్న సంగతి తెలిసిందే.'బహుశా ఇవే నా చివరి ఆసియా క్రీడలు. మరో నాలుగేళ్ల తర్వాత ఇదే స్థాయిలో ఆడగలనని అనుకోవడం లేదు. నేను ఆడితే అత్యున్నత స్థాయిలోనే ఆడాలి. అంతకంటే తక్కువ స్థాయిలో కొనసాగాలని అనుకోవడం లేదు. శారీరకంగా, మానసికంగా ప్రస్తుతం మంచి స్థితిలో ఉన్నాను. గత వారం వియత్నాం ఓపెన్ ఆడాను. కొంతకాలం తర్వాత మంచి ప్రదర్శన చేశాను. ఇది నాకు ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. గత ఆసియా గేమ్స్‌లో స్వర్ణ పతకాన్ని త్రుటిలో కోల్పోయాం. ఈసారి ఫైనల్‌కు చేరుకుని బంగారు పతకం సాధిస్తామని ఆశిస్తున్నా. నా లక్ష్యం లాస్‌ఏంజెల్స్ ఒలింపిక్స్. వచ్చే ఏడాదిన్నర కాలం పాటు ప్రయత్నిస్తాను. ఒలింపిక్స్‌కు అర్హత సాధించే వాస్తవిక అవకాశం ఉందని అనిపిస్తే కొనసాగుతాను. లేదంటే ఆ తర్వాత నిర్ణయం తీసుకుంటాను.' అని ప్రణయ్ అన్నాడు.

వెస్టిండీస్‌తో సిరీస్.. యశస్వికి ఎక్కువ అవకాశాలు ఇవ్వాలి: ఇర్ఫాన్ పఠాన్



ఇంటర్నెట్ డెస్క్: సెప్టెంబర్ 27 నుంచి స్వదేశంలో భారత్-వెస్టిండీస్ మధ్య మూడు వన్డేల సిరీస్ జరగనుంది. ఈ నేపథ్యంలో భారత మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ కీలక వ్యాఖ్యలు చేశాడు. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు ఎక్కువ అవకాశాలు ఇవ్వాలని అభిప్రాయపడ్డాడు. ఈ సిరీస్‌లో తాను ప్రత్యేకంగా యశస్వి ఆటను గమనించనున్నట్లు తెలిపాడు. 2027 వన్డే ప్రపంచ కప్‌ను దృష్టిలో పెట్టుకుని యశస్వికి తగినన్ని అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని వెల్లడించాడు.'ఈ సిరీస్‌లో నేను ఒక ఆటగాడిపై ప్రత్యేకంగా కన్నేయబోతున్నాను. అతడే యశస్వి జైస్వాల్. ముఖ్యంగా వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌లో అతడికి ఎన్ని అవకాశాలు లభిస్తాయో చూడాలని ఆసక్తిగా ఉంది. ప్రస్తుతం జైస్వాల్ మన జట్టులో బ్యాకప్ ఓపెనర్‌గా ఉన్నాడు. వన్డే ప్రపంచకప్ సమయానికి బ్యాకప్ ఓపెనర్‌కు తగినన్ని మ్యాచ్‌లు ఆడిన అనుభవం లేకపోవడం సరికాదు. అందుకే అవకాశం వచ్చినప్పుడల్లా జైస్వాల్‌ను ఆడించాలి. అతడు క్రమం తప్పకుండా వన్డేలు ఆడుతూ ఉండాలి' అని పఠాన్ సూచించాడు.

యువ ఆటగాళ్లకు మంచి అవకాశం

'శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ ఆసియా క్రీడల్లో ఆడుతున్నారు. అందుకే వారు వెస్టిండీస్ సిరీస్‌కు అందుబాటులో లేరు. మిగతా ఆటగాళ్లకు ఇది గొప్ప అవకాశం. దాదాపు రెండో జట్టులా కనిపిస్తున్న ఈ బృందంలో పలువురిని పరీక్షిస్తున్నారు. నితీశ్ కుమార్ రెడ్డి, ధ్రువ్ జురెల్, ఆకిబ్ నబీ, గుర్నూర్ బ్రార్‌లకు అవకాశాలు లభించనున్నాయి. అంతర్జాతీయ క్రికెట్‌లో తమ కెరీర్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలి. వచ్చే ఏడాది జరగనున్న ప్రపంచకప్‌కు ముందు భారత్ 11 వన్డేలు ఆడనుంది. ఈ సమయంలో బెంచ్ బలాన్ని కూడా పరీక్షించాలి. ఆసియా క్రీడలు, వెస్టిండీస్ సిరీస్ ఒకేసారి రావడం యువ ఆటగాళ్లకు కలిసొచ్చే అంశం' అని పఠాన్ వెల్లడించాడు.